# తుప్పు పట్టుతున్న 218 ప్రభుత్వ సైకిళ్ళ సద్వినియోగానికి చర్యలు

## పెన్ పవర్ కథనానికి స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి అత్తోటి కిరణ్ కుమార్

## సమగ్ర నివేదిక సమర్పించాలంటూ కొమరోలు విద్యాశాఖ అధికారికి ఆదేశం



**కొమరోలు పెన్ పవర్ జూలై 22**

కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పురాతన తరగతి గదిలో గత ఏడు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉంటూ తుప్పు పడుతున్న 218 ప్రభుత్వ సైకిలను సద్వినియోగం చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి తోటి కిరణ్ కుమార్ తెలిపారు. 2016 -17 విద్యా సంవత్సరానికి,2017- 18 విద్యా సంవత్సరాలకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం నేను బడికి వస్తా పథకం ద్వారా పాఠశాలలో చదువుతున్న బాలికల కొరకు 417 సైకిళ్లను సరఫరా చేసింది. వాటిని కొమరోలు మండలంలోని పాఠశాలలకు పంపిణీ చేయగా అన్ ఎయిడెడ్ పాఠశాలలకు సైకిలను పంపిణీ చేయుటకు వ్యక్తమైన అభ్యంతరాల వలన 218 సైకిళ్ళు మిగిలిపోయాయి .అప్పటి ఎంఈఓ సదరు 218 సైకిల్స్ ను కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఒక శిథిలావస్థలో ఉన్న తరగతి గదిలో నిలువ ఉంచి తాళాలు వేశారు .అయితే ఆ తరువాత సైకిళ్ల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో అవి గత ఏడు సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న తరగతి గదిలో బందీలుగా ఉంటూ ఉన్నాయి. దీనితో సైకిళ్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుతున్నాయి. సదరు విషయాన్ని వివరిస్తూ పెన్ పవర్ దినపత్రికలో తుప్పుపట్టుతూ శిథిలావస్థకు చేరుతున్న 218 ప్రభుత్వ సైకిళ్లు అనే శీర్షికతో వార్తా కథనం వెలువడింది. కాగా జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ మంగళవారం కొమరోలు లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను విచారణ నిమిత్తం సందర్శించారు. సందర్భంగా పెన్ పవర్ ప్రతినిధి విద్యాశాఖాధికారితో తుప్పుపడుతూ శిథిలావస్థకు చేరుతున్న 218 ప్రభుత్వ సైకిళ్ళ గురించి వివరించారు .అందుకు స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి 218 ప్రభుత్వ సైకిళ్లు తుప్పు పడుతూ నిరుపయోగంగా మారటం విచారకరమని పేర్కొన్నారు .సదరు సైకిళ్లపై సమగ్ర నివేదికను తన సమర్పించాలని మండల విద్యాశాఖ అధికారి కే వెంకటేశ్వర్లు ఆదేశించారు. తద్వారా ప్రభుత్వ సైకిల్లను సద్వినియోగపరిచే చర్యలు తీసుకుంటామని డీఈఓ కిరణ్ కుమార్ తెలిపారు.

పెన్ పవర్ ఎక్స్‌క్లూజివ్ ఎఫెక్ట్

పెన్ పవర్
ప్రకాశం

## ప్రశంసలు, ప్రోత్సాహం తోనే కళాకారులలో నూతనోత్తేజం

### తాను గీసిన పలు రకాల చిత్రాలకు సాధారణమిచ్చిన పెన్ పవర్

### పెన్ పవర్ పత్రికా యాజమాన్యానికి ధన్యవాదాలు

### ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి అత్తోటి కిరణ్ కుమార్





**కొమరోలు పెన్ పవర్, జూలై 22**

ప్రేక్షకుల హర్షధ్వనాలు, పాఠకుల ప్రశంసలు, ప్రోత్సాహం కళాకారులలో నూతనోత్తేజాన్ని పెంపొందింప చేస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి అత్తోటి కిరణ్ కుమార్ పేర్కొన్నారు .మంగళవారం ఆయన కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్ ను సందర్శించిన సందర్భంగా పెన్ పవర్ ప్రతినిధితో మాట్లాడుతూ మహాశివరాత్రి, శ్రీరామనవమి ,రంజాన్ ,ఈస్టర్ పర్వదినాలతో పాటు జాతీయ మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాను గీసిన చిత్రాలను పెన్ పవర్ దినపత్రికలో వార్తా కథనాలను ప్రచురించడం తనకెంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. అందుకు పెన్ పవర్ పత్రికా యాజమాన్యానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లుగా ఆయన చెప్పారు .కాగా కళాకారులను ప్రోత్సహించి వారిలో నూతనోత్తేజం కలిగించేవి ప్రేక్షకుల హర్షధ్వనాలు, పాఠకుల ప్రశంసలేనని పేర్కొన్నారు. తాను గీసిన చిత్రాలపై పెన్ పవర్ దినపత్రికలో వచ్చిన వార్త కథనాలను చదివిన జిల్లాలోని అనేకమంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యావేత్తలు,తోటి కళాకారులు తనపై ప్రశంసల జల్లులు కురిపించారని అన్నారు. తాను గీచిన చిత్రాలను వార్తా కథనాల ద్వారా పాఠక లోకానికి అందించిన పెన్ పవర్ యాజమాన్యం అభినందనీయులని డీఈఓ పేర్కొన్నారు. చిన్నతనం నుంచి చిత్రకళా రంగంపై మనకు ఎంతో మక్కువ ఉన్నదని ,దాని ద్వారానే నేటికీ సందర్భానుసారంగా చిన్న చిన్న చిత్రాలను గీస్తూ ఉన్నట్లుగా కిరణ్ కుమార్ పేర్కొన్నారు.




# రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### ఆగష్టు 15 నుంచి రైతులకు అన్నదాత సుఖీభవ -నాడు రైతులను పట్టించుకోకుండా

### రైతుల పై జగన్ రెడ్డి మొసలి కన్నీరు -జగన్ రెడ్డి ధరల స్థిరీకరణ నిధుల ను ఏర్పాటు అన్నాడు ఏర్పాటు చేశాడా ??

### గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల









**గిద్దలూరు పెన్ పవర్ జూలై 22**

రైతుల సంక్షేమమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు.. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు గిద్దలూరు మండలంలోని కొంగలవీడు, బయనపల్లె, కొమ్మునూరు గ్రామాల్లో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పర్యటించారు. కొంగలవీడు గ్రామంలో రూ.15 లక్షల తో నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు, కొంగలవీడు గ్రామం నుండి నరవ గ్రామానికి రూ. 3 కోట్ల 20 లక్షలతో నిర్మించిన ఆర్ -బి రోడ్డును ప్రారంభించారు. వేములపాడు, కొమ్మునూరు గ్రామాల్లో రూ. 20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి మహిళలు, అవ్వా, తాతలతో మాట్లాడి, గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడాది పాలనా కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని, మహిళా సంక్షేమానికి, రైతుల సంక్షేమానికి, యువత భవిష్యత్తు కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. గత వైసీపీ పాలకులు రైతులను నట్టేట ముంచిందని, రైతుల పేరు చెప్పుకొని నాడు అధికారంలోకి వచ్చి రైతుల మోటార్లకు మీటర్లు బిగించిన ఘనత జగన్ రెడ్డిదేనని అన్నారు. కాకుండా ధరల స్థిరీకరణ నిధులు ఏర్పాటు చేస్తామని చెప్పిన జగన్ రెడ్డి ఆనిధులు ఏర్పాటుచేసి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించారు అని ప్రశ్నించారు. నేడు వైఎస్సార్ సీపీ ప్రజలను ఎంత మోసం చేయాలో చేసి నేడు నీతి వాక్యాలు చెబుతున్నారని అశోక్ రెడ్డి ఎద్దేవాచేశారు. తన హయాంలో వ్యవసాయాన్ని గాలికి వదిలేసి నేడు రైతుల పట్ల మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. ఇటీవలే బంగారుపాళ్యం మామిడి రైతులను పరామర్శించటానికి వెళ్లి రైతులను పరామర్శించకుండా రోడ్లు మామిడి పండ్లను పోసి ట్రాకటర్ తో తొక్కించిన విద్దానం హేయంగా ఉందని అశోక్ రెడ్డి విమర్శించారు. పెండింగులో ఉన్న ప్రాజక్టులను గూర్చి ఐదేండ్లు పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కూటమి పాలనలో రైతుల సంక్షేమం కోసం, గిట్టుబాటు ధరలు, పొగాకు, మామిడి కొనుగోళ్లకు కృషి చేస్తుంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డి మాత్రం మొసలి కన్నీరు కార్చటం సిగ్గుచేటు అన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ. 20 వేలు అందచేస్తామని, మొదటి విడతగా ఆగష్టు 15 వ తేదీన రూ. 7 వేల రూపాయలు జమ చేయటం జరుగుతుందన్నారు. రైతులకు మేలు చేసే ప్రభుత్వం ఎన్డీయే కూటమి ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, జడ్పీటీసీ సభ్యులు బుడతా మధుసూదన్, పంచాయతీ రాజ్ డీఈ సుబ్బారెడ్డి, కర్నాటి రామసుబ్బారెడ్డి, సర్పంచులు కడియం శేషగిరి, సొసైటీ బ్యాంకు డైరెక్టర్లు బద్రి గోపాల్ రెడ్డి, మండల నాయకులు నంది శ్రీను, దప్పిలి శ్రీనివాసరెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, మందగిరి రంగస్వామి, షేక్ షేక్షావలి, స్థానిక నాయకులు నాగిరెడ్డి పవన్, స్వామి రంగారెడ్డి, విష్ణురాజు, రాధామోహన్, పిచ్చయ్య, బాబాయ్, బూనబోయిన రాజశేఖర్, బాలరంగారెడ్డి, గంటా శేఖర్ రెడ్డి, పోలిరెడ్డి, ఆవుల గోపాల్, కోటిరెడ్డి, దిబ్బగండ్ల కాశన్న, కౌలూరి కాశన్న, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలి

### - ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

### - జిల్లా కలెక్టర్ల తో వీడియో కాన్ఫరెన్స్



**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 22**

పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన పొగాకు కొనుగోలును పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంబంధిత జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు. ముఖ్యమంత్రి మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ల తో వర్చువల్ గా సమావేశమై వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించి ఎరువులు, పొగాకు కొనుగోలు, డ్రోన్స్ వినియోగం, సీజనల్ కండిషన్స్, పంట నమోదు వివరాలు, రిజర్వాయర్ లో నీటి నిల్వలు, వర్షపాతం, పురుగు మందుల వినియోగం, సేంద్రీయ వ్యవసాయం తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, ఒంగోలు లోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు. ఈ రోజు వరకు జిల్లా లో 224 మంది రైతుల వద్ద నుంచి 657 మెట్రిక్ టన్నుల" నల్లబర్లీ పొగాకు" ను కొనుగోలు చేయటం జరిగినదని, దీని విలువ సుమారు 5.5 కోట్లు వుంటుందని జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి కి వివరించారు. జిల్లాకు సరిపడా ఎరువుల నిల్వలు వున్నాయని తెలియచేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస రావు, మార్క్ఫెడ్ డి ఎం హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతులకి పొగాకు రైతులకి గిట్టుబాటు లేదు కానీ పవన్ కళ్యాణ్ సినిమాలకు మాత్రం గిట్టుబాటు ధరలు

**ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం కాదు పవన్ కళ్యాణ్ ప్రభుత్వం**



**దర్శి జూలై 22 పెన్ పవర్ :** రాష్ట్ర అసంఘటిత కార్మికుల మరియు ఉద్యోగుల కాంగ్రెస్ పార్టీ చైర్మన్ దర్శి నియోజకవర్గం సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు ఆంధ్ర అని అమ్మేయాలన్నా అచ్చెన్నాయుడు ఈ ప్రభుత్వం మహిళల వ్యతిరేకి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతగాని కూటమి ప్రభుత్వం గత సంవత్సరం ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు అన్నారు ఈ రోజుకి అమలు కాలేదువిజయనగరం జిల్లా కొత్తవలస సభలో అచ్చెన్నాయుడు ప్రభుత్వం చేతకానితనాన్ని తెలియజేశారు. రైతుల కష్టాల్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం మామిడి రైతులు పొగాకు రైతులకి గిట్టుబాటు లేదు కానీ పవన్ కళ్యాణ్ సినిమాలకు మాత్రం గిట్టుబాటు ధరలు ఈ ప్రభుత్వం రైతుల ప్రభుత్వం కాదు పవన్ కళ్యాణ్ ప్రభుత్వం గ్రామపంచాయతీ నిధులు దారి మళ్లింపు 15 ఫైనాన్స్ నిధులు పంచాయితీకి రావడం లేదు. గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికులు నిధులు లేక పనులు గాలికి వదిలేశారు. గ్రామాలలో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు అభివృద్ధి కుంటుపడింది ప్రజల వ్యతిరేక నిర్ణయాలపై కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు చేస్తుంది.

## నరేంద్ర మోడీ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి

**బిజెపి నాయకురాలు విజయలక్ష్మి**



**పొదిలి, పెన్ పవర్, జులై 22**

భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి చెప్పారు నరేంద్ర మోడీ 11 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా మంగళవారం నాడు మండలంలోని కష్టాలపల్లి గ్రామంలో బిజెపి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న బెల్లంకొండ విజయలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు అలాగే వాటికి సంబంధించిన కరపత్రాలను కూడా గ్రామంలోని ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వాన్ని బలపరచడం ద్వారా భారతదేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించే విధంగా అందరూ కృషి చేయాలని ఆమె సూచించారు ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దోర్నాల రమణారెడ్డి, పట్టణ బిజెపి అధ్యక్షులు యుద్ధం మహేష్, బిజెపి మైనారిటీ విభాగపు కో కన్వీనర్ సయ్యద్ ఖాదర్ భాషా, సీనియర్ బిజెపి నాయకులు పువ్వాడ నారాయణ, సూరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు పంగనామాలు పెట్టిన కూటమి ప్రభుత్వం అంటూ నిరసన తెలిపిన మున్సిపల్ కార్మికులు.

**తమ సమస్యలు పరిష్కారం చేయాలని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఈ నెల 16వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వర్తిక సమ్మెను ప్రారంభించడం జరిగింది.**

**ఈ సమ్మె గిద్దలూరులో ఏడవ రోజు కు చేరింది**




**గిద్దలూరు పెన్ పవర్ జులై 22**

కార్మికులకు జీతాలు పెంచుతూ ఇచ్చిన జీవోలో పారిశుధ్య కార్మికులకు ఎలాంటి న్యాయం జరగలేదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం మురళి డి రంగయ్య ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్మికులకు అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్డ్ అయిన ప్రతి కార్మికుడికి రిటైర్మెంట్ బెనిఫిట్ 70000 ఇవ్వాలని, చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని, ప్రమాద బీమా అమలు చేయాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని చేస్తున్న కార్మికుల పోరాటాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేస్తూ కార్మికులకు పంగనామాలు పెట్టిందని విమర్ధించారు. కార్మికులకు పంగనామాలు పెట్టిన కూటమి ప్రభుత్వం నినాదాలు చేస్తూ మున్సిపల్ కార్యాలయం నుండి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి రవి, ఐ చంటయ్య, కె బాలయ్య, సుబ్బమ్మ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# మునిసిపల్ సిబ్బంది అత్యుత్సాహం

## - ఉప ముఖ్యమంత్రి ఫ్లెక్సీల తొలగింపు

## - మండిపడిన జనసేన కార్పొరేటర్లు










**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 22**

కూటమి ప్రభుత్వంలో కీలక నేత, జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను తొలగించిన సంఘటన మంగళవారం ఒంగోలు నగరంలో చోటుచేసుకుంది. మునిసిపల్ అధికారుల అత్యుత్సాహంతో జనసేన కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ఉప ముఖ్యమంత్రి ఫ్లెక్సీలను తొలగించడం పట్ల కమిషనర్ తో వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకు వారే ఉప ముఖ్యమంత్రి ఫ్లెక్సీలను యధా స్థానంలో ఏర్పాటు చేశారు. వివరాలు ఇలా ప్రముఖ సినీ నటుడు,

ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటించిన హరిహర వీరమల్లు చిత్రం విడుదల సందర్భంగా ఒంగోలు నగరం చర్చి సెంటర్ తోపాటు నగరంలో పలుచోట్ల జనసేన పార్టీ నాయకులు బాలినేని అభిమానులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసిన వారికి ఎలాంటి సమాచారం తెలుపకుండానే ఫ్లెక్సీలను మునిసిపల్ సిబ్బంది తొలగించడం జరిగింది. దీనిని తీవ్రంగా ఖండిస్తూ జనసేన పార్టీ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. కమిషనర్ కార్యాలయానికి చేరుకున్న కార్పొరేటర్లు తొలగించిన ఫ్లెక్సీలను మున్సిపల్ కార్యాలయంలో చూసి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ ఛాంబర్ లోకి ప్రవేశించి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలు తొలగించడం ఏమిటని మునిసిపల్ కమిషనర్ ను నిలదీశారు. తొలగించిన ఫ్లెక్సీలను తిరిగి యదాస్థానంలో పెట్టాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.దీనిపై స్పందించిన కమిషనర్ ట్రాఫిక్ కి అంతరాయం కలగడం వలన తొలగించడం జరిగిందని ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవని తెలిపారు. తిరిగి ఫ్లెక్సీలను ఏర్పాటు చేయిస్తామని ఆయన వివరించారు. అనంతరం జనసేన కార్పొరేటర్లు ఫ్లెక్సీలను స్వయంగా వారే మోసుకుంటూ చర్చి సెంటర్ కూడలిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే ఇలాంటి చర్యలకు పాల్పడ్డారని అన్నారు. రాజకీయ నాయకుల వద్ద అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ఉంటూ ఇలాంటి చర్యలకు పాల్పడటం హేయమైన చర్యగా ఆయన చెప్పారు. జనసేన ఒంగోలు నగర పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్ మలగా రమేష్ మాట్లాడుతూ ఈనెల 24వ తారీఖున విడుదల కానున్న హరిహర వీరమల్లు సినిమా ప్రీమియర్ షో కి జనసేన నాయకులు బాలినేని శ్రీనివాసుల రెడ్డి వస్తున్న సందర్భంగా ఆయనకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. పవన్ కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇదే మొదటి సినిమా అని అన్నారు. పండుగ వాతావరణం లో ఉన్న అభిమానులను ఇబ్బంది పెట్టే విధంగా ఫ్లెక్సీలను తొలగించడం దుర్మార్గం అని అన్నారు. జనసేన అభిమానులను నాయకులను ఇబ్బంది పెట్టాలని చూడటం సరైన పద్ధతి కాదని ఇలాంటి చర్యలకు పాల్పడితే పర్యవసానం తీవ్ర స్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జడ వెంకటేష్, ఈదర చిన్నారి, జనసేన నాయకులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో జగన్ రెడ్డి వెనుకబడిన ప్రకాశం జిల్లాకు ఒరగబెట్టింది ఏమీలేదు

**పశ్చిమ ప్రకాశాన్ని అసలే పట్టించుకోలేదు**

**వెలుగొండ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశాన్ని సస్యశ్యామలం చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయం**

**ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం**

**అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమిపాలన**

**మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి**

**-గిద్దలూరు మండలంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి స్వామి**





**గిద్దలూరు పెన్ పవర్, జూలై 22**

వెలుగొండ ప్రాజెక్టు సస్యశ్యామలం, మార్కాపురం జిల్లా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు . గిద్దలూరు మండలంలోని గడిగోట గ్రామంలో నిర్వహించిన "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమంలో మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సోమవారం రాత్రి పాల్గొన్నారు. గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి తో కలిసి గిద్దలూరు మండలం, గడిగోట గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాయలసీమకు ఏ మాత్రం న్యాయం చేయలేదని విమర్శించారు. అభివృద్ధి పేరుతో చూపించినది ఎడారి పరిస్థితి మాత్రమేనని, కూటమి ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును పూర్తిచేసి రాయలసీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. అదేవిధంగా ఈ ఐదు సంవత్సరాల కాలంలో వెలిగొండ పూర్తి చేస్తాం అదే కాకుండా పులివెందులకు సైతం నీళ్లు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుదేనని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ క్రమంగా అమలు చేస్తోందని చెప్పారు. పింఛన్లు పెంచాం, ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇస్తున్నామన్నారు. మహిళలకు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చామన్నారు. ఆగస్టు 15వ తేదీ నుంచి రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి ప్రకటించారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమమే కూటమి పాలనా ధ్యేయమని మంత్రి డా. డోలా బాల వీరాంజ నేయస్వామి స్పష్టం చేశారు. గత వైకాపా మాదిరి అరాచక పాలన్ చెబోమన్నారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి సమర్ధవంతంగా పనిచేస్తున్నారని .,ఎప్పుడు మమ్మల్ని కలిసినా నియోజకవర్గ సమస్యలపై అంచనాలతో సహా వచ్చి అసమస్య పరిస్కారం అయ్యేవరకు వదలడని , నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారని , ఎప్పుడు ఏ మంత్రిని , అధికారిని కలిసినా నియోజకవర్గ అభివృది గురించి తప్పా మరొకటి అడగడని కితాబిచ్చారు. ఇంత మంచి ఎమ్మెల్యే ను ఎన్నుకున్న మీరు అదృష్ట వంతులని పేర్కొన్నారు. అశోకరెడ్డి నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నారనిపేర్కొన్నారు. ఏడాదికాలం లోనే కోట్లరూపాయలతో అభివృద్ధి పనులు చేశారన్నారు. ఇంకా ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు, అధికారుల వద్ద అభివృద్ధి కార్యక్రమాల టెండర్లు పెట్టి అందుకు నిధులు రాబట్టేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని, వాటికొఅకు ఒకసారికి బదులుగా పదిమార్లు తిరిగి వెంటబడి పనులు చేయించుకుంటారని, అశోక్ కు అవన్నీ సాధ్యం అవుతాయని , ఈ అదేండ్లలో నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తాడని మంత్రి డోల పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఎంత రాత్రి అయిన చినుకులు రాలుతున్నా పెద్దఎత్తున నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## తాత్కాలికంగా వాయిదా పడ్డ మునిసిపల్ కార్మికుల సమ్మె....

**ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మరో పోరాటానికి సిద్ధం...**

**ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు..**






**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 22**

మున్సిపల్ పారిశుద్ధ్య ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి 10వ రోజుకు చేరింది. ముందుగా ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి ప్రకాశం భవనం వరకు బారి ర్యాలీ నిర్వహించి అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని పారిశుద్ధ్య కార్మికులకు సంక్షేమ పథకాలు, గత సమ్మె కాలపుఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ 75000 ఇవ్వాలని... రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాల పెంచాలని కోరుతూ బాగాలేక చనిపోయిన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చకపోతేసమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి నరసింహ, తేల విజయమ్మ, కే గోపి, ఏం బాబు, ఆర్ శ్రీనివాసరావు, కే వెంకటేశ్వర్లు, బుట్టి బాబు, ఎం లక్ష్మీకాంతం, కే మోహన్, రవణ భారతి, బి సుబ్బారావు, డి శాంతి, అనిత యూనియన్ రాష్ట్ర నాయకురాలు కే సామ్రాజ్యం, కొర్నిపాటి మోహన్రావు, ఏం బాబు, బి కోటేశ్వరరావు, వాటర్ వర్క్స్ కార్మికులు కే మోహన్, ప్రతాప్,కే వెంకట్రావు, శ్రీదేవి, దేవయ్య రజిని తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగపరుచుకోవాలి

## -మండల వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి

**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగపరచుకోవాలని మండల వ్యవసాయ అధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి కోరారు. మంగళవారం నాడు మండలంలోని మూగచింతల, కొండాయపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి ఆయా గ్రామాల్లోని రైతులతో సమావేశం జరిపి ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి వారికి అర్థమయ్యే రీతిలో వివరించారు అలాగే రైతులు ఆధునిక సస్య రక్షణ పద్ధతులను పాటించడం ద్వారా అధికవ్యసాలు తగ్గించుకొని, అధిక దిగుబడులు సాధించుకోవాలని సూచించారు అలాగే వ్యవసాయపరంగా రైతులు సాగు చేస్తున్న పంటల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల గురించి వ్యవసాయాధికారి శ్రీనివాసులు రెడ్డి వివరించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందితోపాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సైబర్ నేరాలు, లైంగిక వేధింపుల పై విద్యార్ధులకు అవగాహన









**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ జూలై 22**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బంది మంగళవారం పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 100/112 సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగినది. ముఖ్యంగా విద్యార్థినులకు గుడ్ టచ్ – బ్యాడ్ టచ్ మధ్య తేడా, స్వీయ రక్షణ పద్ధతులు, ఈవ్ టీజింగ్, ప్రేమ పేరుతో మోసాలు, మహిళలపై జరిగే నేరాలపై, చట్టాలపై, సమాజంలో ఆడపిల్లలు/మహిళలు/యువత ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చిస్తూ, బంగారు భవిష్యత్తు కోసం ఏవిధంగా ప్రవర్తించాలనే అంశాల గురించి వివరించారు. సైబర్ నేరాల విషయంలో : ఫేక్ ఎస్ ఎం ఎస్ లు లు, ఓటీపీ మోసాలు, బ్యాంకు పేరుతో వచ్చే ఫోన్ కాల్స్, వాట్సప్ ఫేక్ లింకులు, ఫేక్ లోన్ యాప్స్, కేవైసీ మోసాలు, డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు వంటి వాటి గురించి వివరించారు. ఒకవేళ సైబర్ క్రైమ్ లో బాధితులయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చేసి తగిన వివరాలు తెలపాలి. కళాశాలల్లో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యను, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. డ్రగ్స్ కేసుల్లో పట్టుబడితే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని గుర్తు చేశారు. క్రమశిక్షణతో చదివితే మాత్రమే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని, మీకు ఎవరికైనా మాదకద్రవ్యాల సంబంధిత కార్యకలాపాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. రోడ్డు భద్రత విషయాల్లో హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం, మైనర్లు వాహనాలు నడపకూడదని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని వివరించారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని చెప్పారు. తల్లిదండ్రులు, బంధువులు ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్ళేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వెళ్లాలని చెప్పాలన్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్టు కూడా తెలియజేశారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100 /112 కి కాల్ చేయడం ద్వారా పోలీసుల సహాయం పొందవచ్చని సూచించారు.

# రాష్ట్రంలో చంద్రబాబు అరాచక పాలన

### మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు



**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ అరాచక పాలన సాగుతోందని మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త అన్నా రాంబాబు తీవ్రంగా విమర్శించారు మంగళవారం నాడు పట్టణంలోని దర్శి రోడ్డు ప్రాంతంలో గల మంజునాథ కళ్యాణ మండపం లో జరిగిన బాబు షూరిటీ, మోసం గ్యారెంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా అన్న రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో అలివి గాని వాగ్దానాలు చేసిన చంద్రబాబు అధికారం చేపట్టిన తర్వాత హామీలను తుంగలో తొక్కారని తీవ్రంగా విమర్శలు గుప్పించారు రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికల్లో వాగ్దానాలు చేసి విస్మరించిన వాటి గురించి వైసీపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని ఆయన సూచించారు అందువల్ల చంద్రబాబు ప్రభుత్వ నిజస్వరూపం ప్రజలకు తెలిసే అవకాశం ఉంటుందన్నారు చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలను నమ్మిన ప్రజలు అధికారం అప్పగించారని, ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వ అరాచకపు పాలనను చూసి ప్రజలు నెత్తి నోరు కొట్టుకుంటున్నారని రాంబాబు విమర్శించారు చంద్రబాబు ప్రభుత్వ అసమర్ధ పాలనను వైకాపా కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుని వెళ్లి, ప్రజలకు వాస్తవాలు తెలిసే విధంగా చూడాలని రాంబాబు కోరారు ఈ కార్యక్రమంలో మర్రిపూడి మండల పరిషత్ అధ్యక్షులు వాకా వెంకటరెడ్డి, రాష్ట్ర వైసీపీ నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కె.వి రమణారెడ్డి, వై వెంకటేశ్వరరావు, గొల మారి చెన్నారెడ్డి, జి శ్రీనివాసులు, ముల్లా జాకీర్, గుజ్జుల రమణారెడ్డి తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఉలవపాడులో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం

### అధిక సంఖ్యలో పాల్గొనాలని పార్టీశ్రేణులకు పిలుపు.




**ఉలవపాడు, పెన్ పవర్, జులై 22**

మండల కేంద్రమైన ఉలవపాడులో నేడు అనగా బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం జరుగునని మండల వైసీపీ కన్వీనర్ నన్నం పోతురాజు మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమం ఉలవపాడు పంచాయతీలోని దర్గా సెంటర్, కరేడు రోడ్ నందు జరుగునన్నారు. మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ – మోసం గ్యారంటీ రీకాలింగ్ చంద్రబాబు నాయుడు మేనిఫెస్టో కార్యక్రమంలో బాగంగా బాబు చేసిన మోసాలను ప్రజలకు ఇంటింటికి తిరిగి తెలియజేసే కార్యక్రమం జరుగునన్నారు. కావున మండలంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి తెలియజేశారు.

# మార్కెట్ యార్డ్ చైర్మన్ భూపాల్ రెడ్డిని సన్మానించిన ఎంపీటీసీలు సర్పంచులు



**బెస్తవారిపేట, పెన్ పవర్ జూలై 22**

కంభం మార్కెట్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డిని బేస్తవారిపేట మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు మంగళవారం సన్మానించారు. కంభం మార్కెట్ యార్డ్ ఏర్పడిన నాటినుండి రాష్ట్రములో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ బేస్తవారిపేట మండలానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కలేదు. మార్కెట్ యార్డ్ ఏర్పడి దాదాపు 30 సంవత్సరాల కావస్తున్న మొట్టమొదటిసారిగా బేస్తవారిపేట మండలానికి చెందిన పూనూరు భూపాల్ రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కడముతో ఆయనను ప్రతి ఒక్కరూ అభినందించారు. మంగళవారం మండల సర్వసర సమావేశంలో పూనూరు భూపాల్ రెడ్డి పాల్గొనడంతో ఆయనకు బేస్తవారిపేట మండల స్థాయి అధికారులు,మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ఘనంగా శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ తనను సన్మా నించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# రాష్ట్రంలోనే చంద్రబాబు పాలనలో పేద వర్గాల అభివృద్ధి

### పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాంస వెల్లడి

**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

రాష్ట్రంలోనే చంద్రబాబు ప్రభుత్వ పాలనలో పేద వర్గాల అభివృద్ధి జరుగుతోందని పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమామ్ సా చెప్పారు మంగళవారం నాడు పట్టణంలోని 25 బూత్ పరిధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఇమాంస మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఆశించిన మేరకు కంటే ఎక్కువగా అమలు జరుగుతున్నాయని కొనియాడారు చంద్రబాబు ప్రభుత్వ పాలనతోనే రాష్ట్ర అభివృద్ధి అన్ని విధాల జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు చంద్రబాబు ఏడాది పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన అక్కడి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు అలాగే ఆయా సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను కూడా ఇమాంస ప్రజలకు అందజేశారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇమాంసతోపాటు, షేక్ మస్తాన్, సుబ్బయ్య, సుభాని, ఎస్ భాష తో పాటు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జన విజ్ఞాన వేదిక ప్రకాశం జిల్లా నూతన కమిటీ ఎన్నిక







**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 22**

ప్రకాశం జిల్లా జన విజ్ఞాన వేదిక నూతన కమిటీని మంగళవారం స్థానిక అంజయ్య రోడ్డులోని విజయ పీజీ కాన్ఫరెన్స్ హాలులో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు గా జె సి హెచ్ వెంకటేశ్వర్లు, అధ్యక్షులుగా చిగురుపాటి చిన్నాజీ, ప్రధాన కార్యదర్శిగా కాటినేని పాపారాయుడు, కోశాధికారి ఎం సంజీవరావు తో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జాతీయ సలహా కమిటీ సభ్యులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ నూతన కమిటీ శాస్త్రీయ దృక్పథాన్ని ప్రజల్లో పెంపొందించడంలో, అజ్ఞానం, మూఢనమ్మకాలపై పోరాటం చేయడంలో మరింత చురుకుగా పనిచేస్తుందన్న నమ్మకం ఉంది అని తెలియజేశారు. అదేవిధంగా నూతనంగా ఎన్నికైన కమిటీ రెండు సంవత్సరాలు పాటు ప్రకాశం జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో కమిటీల ఏర్పాటు మండల కమిటీల ఏర్పాటుకు సూచించారు. ప్రతి నెల మొదటి ఆదివారం కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. మూడు నెలలకు ఒకసారి జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేసుకోవాలని తెలియజేశారు. గ్రామ గ్రామాన తిరిగి మూఢనమ్మకాలపై అవగాహన కల్పిస్తూ సభ్యుల సంఖ్య పెంచాలని అందరిని సభ్యులుగా చేర్చాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయివరకు ప్రజల్లో శాస్త్రీయ చైతన్యాన్ని విస్తరించే కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని డా. కొల్లా నాగేశ్వర రావు కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు గయాజ్ భాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లా మధు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్లు, రాష్ట్ర సమతా నాయకులు కొమ్మిరెడ్డి కొండమ్మ, రాష్ట్ర సమాచార కార్యదర్శి మీనా ధనుంజయ, వివిధ డివిజన్ ల నుంచి విచ్చేసిన జనవిజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం కూటమి ప్రభుత్వ లక్ష్యం -ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర









**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 22**

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో మంగళవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి స్థానిక తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమ, అభివృద్ధి గురించి వివరించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే వృద్ధులకు, వితంతువులకు రూ. 4 వేలు. వికలాంగులకు రూ. 6 వేలు పింఛన్లు పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, ప్రతి ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు, ప్రతి విద్యార్థికి తల్లి వందనం ద్వారా రూ. 15 వేలు పలు సంక్షేమ పథకాలు అందించమన్నారు త్వరలో అన్నదాత సుఖీభవ, మహిళకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తారని, యువతకు ఉద్యోగాలు, పారిశ్రామిక అభివృద్ధి సంక్షేమ పథకాలు, కనిగిరి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు గురించి, రానున్న రోజుల్లో చేపట్టబోయే సంక్షేమ అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ళ నారాయణరెడ్డి, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, యన్ సి మాలకొండయ్య, పునుగుపాటి రవికుమార్, అట్లూరి రామకృష్ణంరాజు, బత్తుల వెంకటాద్రి, వల్లపుశెట్టి వెంకటనారాయణ,చావా చంద్రశేఖర్, బండారు వెంకటేష్, ఏసుదాసు వివిధ గ్రామాల తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు తదితరులు పాల్గొన్నారు.

# "డెంగ్యూ "పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి

### ప్రభుత్వ వైద్యాధికారి శరత్ చంద్ర



**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పొదిలి ప్రభుత్వ వైద్యాధికారి శరత్ చంద్ర చెప్పారు డెంగ్యూ మాసోత్సవం సందర్భంగా మంగళవారం నాడు మండలంలోని ఓబులక్కపల్లి గ్రామంలో డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం జరిగింది కార్యక్రమం జరిగిన గ్రామ పాఠశాలలో డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ జాగ్రత్తల వల్ల ఆ వ్యాధి సోకకుండా చూడవచ్చు అన్నారు పరిసరాల పరిశుభ్రత తో పాటు, ఇళ్లలో నీటి నిల్వల పట్ల అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు అనంతరం గ్రామంలో డెంగ్యూ వ్యాధి అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు కృష్ణయ్య, శ్రీనివాసరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఏ ఎన్ ఎం ఆదిలక్ష్మి, నాగభూషణమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్ఐ వెంకటేశ్వర నాయక్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 22**

మాదకద్రవ్యాలపై విద్యార్థినీ విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ అన్నారు మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో మంగళవారం కదిరి వెంకటనరసయ్య లక్ష్మమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ మరియు కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగం హానికరమని, పొగాకు, గంజాయి, డ్రగ్స్ మన ఆరోగ్యాన్ని, చదువు, జీవిత లక్ష్యాలను నాశనం చేస్తాయని అన్నారు లైంగిక వేధింపులు నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు లైంగిక వేధింపులు గురించి చట్టాలు రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నేటి యువత ఎక్కువగా ఫోన్, ఇంటర్నెట్ మీద మోజు చూపడం వల్ల దుష్ఫలితాలు,సైబర్ మోసాలు సోషల్ మీడియా దుర్వినియోగం, రోడ్డు నియమాలు పాటించాల్సిన విధానం గురించి వివరించారు అనంతరం ఏకగ్రతతో చదువు, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు అలాగే కష్టపడి చదువుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు నిర్మించుకోవచ్చని సూచించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బోడా ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతు సేవా కేంద్రాలలో అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా

## అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని రైతులు 23 లోపు నమోదు చేసుకోవాలి

### మండల వ్యవసాయశాఖాధికారి పి మధు బాబు

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 22**

అన్నదాత సుఖీభవ పథకం అర్హుల జాబితా రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని రైతులు పరిశీలించి అర్హత ఉండి పేర్లు లేని రైతులు ఈ నెల 23 లోపు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పి. మధుబాబు గారు తెలిపారు చంద్రశేఖరపురం మండలంలోని చింతలపాలెం,కొండబోయినపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంలో భాగంగా ఈ సంవత్సరం ఖరీఫ్ 2025 లో ప్రకాశం జిల్లాలో నోటిఫ్డి పంటలుగా వరి, కంది, సజ్జ, ఎండు మిరప, నువ్వులు, పత్తి పంటలు ఎంపిక చేశారని తెలిపారు,వరి పంటకి ఎకరాకి 860/-,కంది పంటకి 430/- సజ్జ పంటకి 156/-ఎండు మిరప 4500/- నువ్వులు 180/- ప్రత్తి పంటకి 2100/- రూపాయలు ఎకరానికి చెల్లించాలని, ప్రీమియం చెల్లించే రైతులు రైతు సేవా కేంద్రం లోని వ్యవసాయ మరియు




ఉద్యాన సహాయకుల వద్ద పంట సాగు పత్రం తీసుకోని, ఆధార్ కార్డు,పట్టాదారు పాసు పుస్తకం,బ్యాంకు పాసు పుస్తకం జెరాక్స్, ఆధార్ లింక్ ఉన్న ఫోన్ నెంబర్ తీసుకొని సి ఎస్ సి సెంటర్ కి వెళ్లి ప్రీమియం చెల్లించాలని తెలిపారు రసాయన ఎరువులు వాడకాని తగ్గించి సేంద్రియ



ఎరువులు ఉపయోగించాలని,భూసారా పరీక్ష ఫలితాల ఆధారంగా ఎరువులు ఉపయోగించాలని, కౌలు రైతు కార్డుల వలన ప్రయోజనాల గురించి,పచ్చి రొట్ట విత్తనాలు సాగు చేయడం వలన ఉపయోగాలను గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి. శ్రీనివాసులు,గ్రామ వ్యవసాయ సహాయకులు యన్ రమేష్ మరియు ఆయా గ్రామాలలోని రైతులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీల నిధులను దారి మళ్లించడమేమిటి?

### ప్రభుత్వంపై మండిపడ్డ కాంగ్రెస్ నేత సైదా



**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

గ్రామ పంచాయితీల అభివృద్ధి నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్ళించడం ఏమిటని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా విమర్శించారు మంగళవారం నాడు ఆయన పొదిలిలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు గత డిసెంబర్ లో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం కేటాయించిన 15వ ఫైనాన్స్ నిధులు ఇప్పటివరకు పంచాయతీల ఖాతాలకు జమ కాలేదని సైదా చెప్పారు ఇందువల్ల నిధుల కొరతతో పంచాయితీల్లోని అభివృద్ధి పనులు నిలిచిపోయాయని సైదా ఆందోళన వ్యక్తం చేశారు నిధుల కొరత వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందన్నారు పారిశుద్ధపు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అంటువ్యాధుల బారిన పడాల్సి వస్తుందని సైదా విమర్శించారు అలాగే గత ఆరు మాసాల నుండి జీతాలు లేక పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధపు కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా అలమటిస్తున్నాయని, వారి కుటుంబాలు పస్తులతో కాలం గడపాల్సి వస్తుందని సైదా తీవ్రంగా విమర్శించారు రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పరిస్థితి ఈ విధంగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సైదా ఆక్షేపించారు వర్షాకాలం కావడంతో పాటు పంచాయితీల్లో అభివృద్ధి నిధులు ఆగిపోవడంతో పారిశుద్ధ్యపు పరిస్థితి అధ్వానంగా తయారైంది అన్నారు ఇప్పటికైనా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కళ్ళు తెరిచి గ్రామాల అభివృద్ధి కోసం కేటాయించిన ఫైనాన్స్ నిధులను వెంటనే పంచాయతీ ఖాతాలకు మళ్ళించాలని సైదా డిమాండ్ చేశారు.

# పొదిలిలో హెయిర్ కేర్ సెలూన్ ప్రారంభించిన ఎస్ ఐ వేమన



**పొదిలి, పెన్ పవర్, జూలై 22**

పొదిలిలో నూతనంగా ఏర్పాటు చేసిన హెయిర్ కేర్ సెలూన్ ను పొదిలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రారంభించారు పట్టణంలోని చిన్న బస్టాండ్ సెంటర్లో అలీ హెయిర్ కేర్ సెల్ ఏర్పాటు చేయడంతో, మంగళవారం నాడు పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ వేమన లాంఛనంగా ప్రారంభించారు ముందుగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎస్ ఐ వేమనను నిర్వాహకులు శాలువా, పూలదండతో సత్కరించి, సాదరంగా స్వాగతం పలికారు ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు హల్ చల్ జహీర్, నాగార్జున, అర్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఖరీఫ్ పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా





**గిద్దలూరు పెన్ పవర్ జూలై 22**

గిద్దలూరు మండలం సంజీవరావు పేట గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఖరీఫ్ -2025 పథకం లో ఖరీఫ్ పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం మాంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఎస్. రామ మోహన్, సహాయ వ్యవసాయ సంచాలకులు,జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు పాల్గొని ప్రస్తుత ఖరీఫ్ పంటలైన ప్రత్తి, కంది, ఆముదం కొర్ర మొదలైన పంటల లో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు. భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడిన యెడల పెట్టుబడి లో 20 శాతం తగ్గించవచ్చుని,ప్రత్తి పంటలో పురుగు ని బట్టి సస్య రక్షణ పద్ధతులు చేపట్టాలని, గులాబీ రంగు పురుగు నివారణ కి లింగాకర్షణ బుట్టలు ఎకరాకి 10-15 పెట్టాలని, రసాయన ఎరువులైన యూరియ, డి ఏ పి, కాంప్లెక్స్ ఎరువులకు బదులు ద్రవరూప ఎరువులైన నానో యూరియ, నానో డి ఏ పి, జీవ ఎరువులైన అజోస్పైరిల్లం, అజటోబాక్టర్ రైజోబియమ్ కల్చర్ మొదలైనవి వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయాధికారి విజయ భాస్కర్ రెడ్డి వ్యవసాయ శాఖ ద్వారా అమలువుతున్న పథకాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో విస్తరణ అధికారి శ్రీకాంత్ రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు శంకరమ్మ, మధు శంకర్ రైతులు పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించుకోవాలి



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జులై 22**

పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన సింగల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని మునిసిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు. మంగళవారం పురపాలకసంఘము కార్యాలయంలో దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నిత్యావసరాల నిమిత్తం ప్లాస్టిక్ నకు ప్రత్యామ్నాయంగా వివిధ రకాల సంచులు, ప్రకృతి వనరులు వినియోగం గురించి అవగాహన కల్పించారు. మునిసిపల్ కమీషనర్ పిల్లి కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తుల క్రయ విక్రయాలు, రవాణా, నిల్వ తదితర అన్ని అంశాలపై కఠిన చర్యలను అమలు చేయనున్నట్లు తెలిపారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి జరుగుతున్న హాని గురించి ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయంగా జౌళి, నార గుడ్డ సంచులను ప్రతిరోజు కూరగాయలు ఇతర సరుకుల కోసం వాడుకుంటూ పర్యావరణహితానికై తోడ్పడాలని సూచించారు. ప్రత్యేక బృందాల ద్వారా దుకాణాలు, గోదాములు ఆకస్మిక దాడులను నిర్వహించి భారీ జరిమానాలు విధించి చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. పీ4 నీడ్ అసెస్మెంట్ సర్వే గురించి అవగాహన కల్పించి పీ4 మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని తెలియజేశారు. కనిగిరి పురపాలకసంఘం పరిధిలో ఎక్కువ మంది మార్గదర్శకులు ఉండాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి నెల మూడో శనివారం చేపడుతున్న "స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై "స్వచ్ఛ కనిగిరి " సాకారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈసమావేశంలో దుకాణ యజమానులు తదితరులు టి.గోవిందరావు, పవన్ కుమార్, రమేష్ బాబు, బి.సత్యం, సురేష్, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణ

### ఏవో షేక్ .మహమ్మద్





**పెన్ పవర్, కంభం జూలై 22**

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తూ ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ సూచనలను పాటించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి షేక్. మహమ్మద్ కోరారు. కంభం మండలంలోని కందులాపురం ఔరంగాబాద్ గ్రామాలలో మంగళవారం పర్యటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మహమ్మద్ రైతు లందరూ పంటలకు భీమా చేయించు కోవాలని చెప్పారు. మన జిల్లాలో ప్రధాన మంత్రి ఫసల్ భీమా పథకం క్రింద 6 పంటలు, వాతావరణం భీమా కింద ప్రత్తి పంటను నోటిఫై చేయడం జరిగిందని. మొత్తం 7 రకాల పంటలకు భీమా చేయించు కోవడానికి అవకాశం ఉందని తెలిపారు. అవి1.వరి పంటకు ఆగస్టు 15 వరకు,మిరప, మినుము,నూగు, సజ్జ, కంది పంటల కు ఈ నెల 31 వరకు బత్తాయి,మామిడి జామ,టిష్యూ కల్చర్ అరటి పండ్ల తోటలకి 40% రాయితీ మరియు హైబ్రిడ్ కూరగాయల సాగు కి 50% మరియు శాశ్వత కూరగాయల పందిరి లకు 50% రాయితీ పై మరియు వ్యక్తిగత నీటి కుంటలకి 50%రాయితీ పై పథకాలు అమలులో ఉన్నాయని తెలిపారు . ఈ కార్యక్రమానికి గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ మస్టర్లపై ఏపీఓను నిలదీసిన ఎంపీటీసీలు సర్పంచులు

**బేస్తవారిపేట,పెన్ పవర్ జూలై 22**

బెస్తవారిపేట మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఉపాధి హామీ పై జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో గ్రామాన్ని విడిచి వేరే ప్రాంతంలో ఉద్యోగాలు చేసుకుంటున్నా వారికి మస్టర్లు వేస్తున్నారని ధ్వజమెత్తారు. ఫీల్డ్ అసిస్టెంట్లు వారితో కుమ్మక్కై చెరి సగం వాటాలు పంచుకుంటున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. అధికారులు ఈ విషయంపై ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు ఈ సందర్భంగా ఏపీవో గురువర కుమార్ మాట్లాడుతూ పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన సభకు తెలిపారు. లబ్ధిదారులకు అందాల్సిన ఇసుక సక్రమంగా అందడం లేదని ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కై సొమ్ము చేసుకుంటున్నారని గృహ నిర్మాణ శాఖ అధికారుల తీరుపై ఎంపీపీ ఓ సూరారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని వంగపాడు కా జీపురం. ఎంపీ చెరువు తదితర గ్రామ సమైక్య కమిటీల తొలగింపు. నూతన కమిటీ ఇలా ఎన్నిక విషయంలో బైలా చట్టం నియమ నిబంధనలను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని అడ్డగోలుగా పాత కమిటీ సభ్యులను తొలగించిన తీరుపై అధికారు లను ఎంపీపీ తప్పు పట్టారు ఎంపీ చెరువులో కప్పల కుంట ఆక్రమణ కు గురైందని అలుగును సైతం అక్రమార్కులు అలుగును ధ్వంసం చేసి సాగు భూములుగా మార్చేస్తున్న అధికారులు మౌనం వహిస్తున్నారని ఎంపీటీసీ సభ దృష్టికి తీసుకువచ్చారు. జేసీ అగ్రహారంలో నిర్మించిన సచివాలయ భవనానికి తనకు రావలసిన 4 లక్షల80వేలుబిల్లును అధికారులు కావాలనే హోల్డ్ లో పెట్టారని ఎన్నిసార్లు విన్నవించుకున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తనకు ఆత్మహత్య శరణ్యమని గుత్తేదారు రామచంద్రారెడ్డి సభాముఖంగా




ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఓబినేనిపల్లిలో విలేజి హెల్త్ క్లినిక్ లో ఎంఎల్ పీహెచ్పీలో అందుబాటులో ఉండడం లేదని అదే మని ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానం ఇస్తుందని చిన్న ఓబినేనిపల్లి సర్పంచ్ సభకు వివరించారు. పూసలపాడు ప్రాథమిక వైద్యశాలలో రాత్రి వేళలో స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండడం లేదని ఆ సమయంలో వైద్యశాలను మూసి వేస్తుండటంతో వైద్యానికి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పూసలపాడు గ్రామంలో పలువురి జాబ్ కార్డు లు అధికారులు నిష్కారణంగా తొలగించారని ఈ విషయం పీడీకి ఫిర్యాదు చేసిన నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. పెంచికలపాడు కొత్త చెరువులో మట్టిని ఇటుకల బట్టీలకు తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యుల ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఏవి రంగనాయకులు జెడ్పీటిసి బీ వి రాజయ్య. కంభం మార్కెట్ యార్డ్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డి. మండలంలోని ఎంపీటీసీలు సర్పంచులు వివిధ శాఖల అధికారులు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సూపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో అడక స్వాములు



**మద్దిపాడు మండలం దొడ్డవరం పెన్ పవర్ జూలై 22**

మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామం 130వ వార్డు దాసరిపాలెం లో మంగళవారం ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి అడక స్వాములు మరియు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వడ్డెంపూడి శ్రీనివాసరావు కలిసి గడపగడపకు తిరిగి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ సెక్రెటరీ కుంచాల శ్రీనివాసరావు వార్డ్ నెంబర్లు కాట్రగడ్డ సుబ్బారావు భీమవరపు వెంకటరావు మరియు జక్కుల చంద్రశేఖర్ బీసీ సెల్ అధ్యక్షుడు మూరబోయిన సురేష్ బాబు మాజీ ఎంపీటీసీ కొత్త సుమన్ వల్లెపు సాయికుమార్ మద్దులూరు వెంకట్రావు మరియు పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మోడల్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

### ఎంఈఓ రాజాల కొండారెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 22**

మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాశాఖాధికారి రాజాల కొండారెడ్డి అన్నారు మంగళవారం మండల కేంద్రంలోని ఎస్టి పాఠశాల మరియు సిఎస్పురం మెయిన్ మోడల్ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 16 మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని, అన్నిటిలో అన్ని సదుపాయాల కల్పనలో భాగంగా అన్నిటిలో తరగతి గదులు, పెయింటింగ్, విద్యుత్తు, త్రాగునీరు, గ్రీన్ బోర్డులు, డ్యుయల్ డేస్కులు వంటి అంశాలను గుర్తించి ఎస్టిమేషన్లు సమర్పించామని త్వరలోనే అన్ని సదుపాయాల కల్పన జరుగుతుందన్నారు ఉపాధ్యాయ హ్యాండ్ బుక్స్ అన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులకు అందించటం జరిగిందని, ఉపాధ్యాయుల విద్యా బోధనను మరింత ప్రభావంతంగా చేయడంలో హ్యాండ్ బుక్స్ కీలక పాత్ర పోషిస్తాయని, సబ్జెక్టు వారీగా సిద్ధం చేసిన హ్యాండ్ బుక్స్ ఉపాధ్యాయులకు బోధనలో సహాయ పడటంతో పాటు



విద్యార్థుల పట్ల సమగ్ర అవగాహన ఏర్పడేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు ఉపాధ్యాయులు హ్యాండ్ బుక్స్ ని ఉపయోగించాల్సిన తీరును వారికి వివరించారు పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటిన విద్యార్థులకు ప్రోత్సాహంగా ప్రభుత్వం అందజేసిన గ్రీన్ పాస్పోర్టులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో సి ఆర్ పి సతీష్ కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.



# సహజ జీవన ఎరువులతో రైతులకు ఎంతోమేలు.

## పూరేటిపల్లి, పరకొండపాడులో పొలం పిలుస్తోంది.





**గుడ్లూరు, పెన్ పవర్, జులై 22:**

సహజ జీవన ఎరువులతో పంటలకు హానికలుగదని, రైతులకు కూడా తక్కువ ఖర్చుతో పాటు ఎంతోమేలు జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి బి.రవికుమార్ తెలిపారు. మండలంలోని పరకొండపాడు మరియు పురేటిపల్లి రైతు భరోసా కేంద్రాల పరిధిలోని గ్రామలలో ఏ.ఓ బి.రవికుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రవికుమార్ రైతులతో జీవన ఎరువుల వల్ల ఉపయోగాలు వివరిస్తూ మన ప్రమేయం లేకుండా సహజసిద్ధంగా నేలల్లో ఉన్న సూక్ష్మ జీవులు, నాచు శిలింద్రల చర్యల వల్ల మొక్కల వల్ల ఎంతో ఉపయోగం కలుగుతుందని, పంటమార్పిడి వల్ల ప్రతి రెండు సాధారణ పైర్ల సాగుకు మధ్య వేసే పప్పు జాతి పైర్లు వల్ల సహజంగా సూక్ష్మ జీవుల సంఖ్య పెరిగి చాలా లాభం పోదుతున్నామన్నారు. జీవన ఎరువులు సహజమైనవని, వాటి వల్ల కాలుష్యం ఉండదు మరియు పంటకు కూడా హాని చేయదని అన్నారు. రసాయన ఎరువుల ధరలు ఎక్కువగా ఉండడం వలన జీవన ఎరువుల ప్రాముఖ్యత రోజు రోజుకు పెరుగుతుందన్నారు. సమగ్ర ఎరువుల వాడకంలో ఇవి ఒక బాగమై నేల ఆరోగ్యం ఉత్పాదకత కాపాడడంలో దిగుబడి నాణ్యత పెంచడంలో ప్రముఖపాత్ర వహిస్తుందన్నారు. ఇవి వాతావరణంలో నత్రజనిని స్థిరీకరిస్తాయని, నేలలోని స్వభావన్నీ అందుబాటులోకి తెస్తాయని, హార్మోన్లు, విటమిన్లు, ఎంజైములు లభ్యమై మొక్క పెరుగుదల చురుకుగా ఉంటుందని, వీటితో పాటు సాధారణంగా దిగుబడులు 10 నుండి 20 శాతం వరకు పెరుగుతాయన్నారు. 20 నుండి 25 శాతం నత్రజని, భాస్వర ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చునని, నేల నుండి సంక్రమించే తెగుళ్లను కొంతమేరకు నిరోధించబడతాయన్నారు. ఉపయోగకరమైన సూక్ష్మ జీవులు గమణీయంగా పెరుగుతాయని, నేల భౌతిక లక్షణాలు మెరుగుపడతా యని, వేర్లకు గాలి, నీరు బాగా లభ్యమవుతాయని వృక్ష సంబంధిత భాగాలు నాణ్యతరుచి పెరుగుతుందన్నారు. పశువులమేతలో పోషకాల పరిమాణం పెరుగుతుందని, రైతులకు ఎరువు ఖర్చు తగ్గుతుందని, రసాయన ఎరువుల దిగుమతికి అయ్యే విదేశీమారక ద్రవ్యం ఆదా అవుతుందని అన్నారు. జీవన ఎరువులు ఎంతగా ఉపయోగించుకుంటే అంతగా వృద్ధి చెందుతాయని అన్నారు. నేలలో ఉన్న భాస్వరాన్ని కరిగించి లభ్యరూపంలోనికి మారుస్తాయని, అంతే కాకుండా మొక్కలకు అందుబాటులోకి తెస్తాయని అన్నారు. ఈ కార్యక్రమములో గ్రామ నాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రేమ్ బాబు , రఘు, ఏ.ఎం.సీ నుండి రెప్రజెంటేటివ్ అనీల్ మరియు రైతులు పాల్గొన్నారు.

## నేడు ఇస్లాంపేటలో విద్యుత్ అంతరాయం

**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 22**

విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తుల కారణం వలన బుధ వారం నాడు ఇస్లాం పేట, రిక్షాలు బజార్ , గుంటూరు రోడ్ తదితర ప్రాంతాలలో ఉదయం 7 గం నుండి మధ్యాహ్నం 11గం వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డి ఈ ఈ కె వి పాండురంగ రావు తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రావూరి శ్రీనివాసులునాయుడు రూ:10,000/- విరాళం



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 22**

మండలంలోని చెమిడిదపాడు గ్రామ బస్టాండ్ వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గుడ్లూరు వాస్తవ్యులు రావూరి శ్రీనివాసులు నాయుడు, రాధారాణి దంపతులు పదివేల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆలయ నిర్మాణ ప్రాంగణంలో మంగళవారం ట్రస్ట్ అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావు కు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ కోటి వ్రాసే పుస్తకాలను, హనుమాన్ చాలీసా పారాయణ పుస్తకాలను ఆ దంపతులకు ట్రస్ట్ అధ్యక్షులు అందజేశారు. విరాళం అందించిన శ్రీనివాసులు నాయుడు, రాధారాణి దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆ సీతారామ లక్ష్మణ భరత శత్రుఘ్ను సహిత శ్రీ సువర్చలా పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ట్రస్టు తరపున హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

## పార్టీ కార్యకర్తను పరామర్శించిన మాజీ మంత్రి మెరుగు నాగార్జున

**మద్దిపాడు మండలం తెల్లపాడు జూలై 22**

మద్దిపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన చీకటి ఆంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న అతని మాజీమంత్రి సంతనూతలపాడు సమన్వయకర్త డాక్టర్ మెరుగ నాగర్జున పరామర్శించారు అక్కడ డాక్టర్లతో మాట్లాడి ఆరోగ్యం పరిస్థితి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ వాక అరుణ కోటిరెడ్డి దొడ్డవరం తెల్లపాడు వైసిపి పార్టీ ముఖ్య నాయకులు నాదెండ్ల మహేష్ మరియు ఎంపీటీసీ మేరిగ పద్మవతి పాల్గొన్నారు.



## చెరుకూరు ముండ్లమూరివారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం






**పొన్నలూరు పెన్ పవర్ జులై 22**

మండలంలోని చెరుకూరు ముళ్లమూరివారిపాలెం గ్రామాలలో వ్యవసాయాధికారి వి రాము ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సహాయ వ్యవసాయ సహాయకురాలు సింగరాయకొండ డాక్టర్ ఈ.నిర్మలా కుమారి మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్లో వేసిన ప్రతి పంటకూ పంట నమోదు కార్యక్రమం సంబంధిత వ్యవసాయ సహాయకులు ద్వారా చేసుకోవాలని సూచించారు.ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ద్వారా 10 రకాల నవధాన్యాలు రైతులకు సరఫరా చేస్తున్నారని కావలసిన రైతులు తీసుకొని భూమిలో వేసుకొని పూత దశలో కలియ దున్నడం వలన సేంద్రియ కర్బనం వృద్ధి చెంది, పంటకు కావలసిన పోషకాలు లభ్యమవుతాయని తద్వారా భూసారం పెరిగి అధిక దిగబడి పొందవచ్చునని తెలియజేశారు.అలాగే అన్నదాత సుఖీభవ పథకం కింద అర్హులైన రైతులు రేపటి 23తేదీ లోపల మీ సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి వి రాము మాట్లాడుతూ ఖరీఫ్ రబీ సీజన్లో వేసే ప్రతి కౌలు రైతు మీ సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులకు మీరు వేసే పంటను తెలియజేసి గ్రామ రెవెన్యూ అధికారులు ద్వారా కౌలు ధ్రువీకరణ పత్రాలను పొందవచ్చునని, తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు,ఎరువులు, ధాన్యం అమ్ముకోవడానికి, ప్రకృతి వ్యాపారిత్యాల వల్ల వచ్చే పంట నష్టం లేదా పంట పండకపోతే ఇన్సూరెన్స్, బ్యాంకు నుండి పంట రుణాలు అన్నదాత సుఖీభవ వంటి పథకాలను పొందవచ్చునని తెలియజేసారు.రైతులందరికీ తెలియజేయడం ఏమనగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం 2025-26 సం ఖరీఫ్ సీజన్ కి గాను,పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించింది.(క్వింటాలు) వరి సాధారణం రూ.2360.00 , వరి ఏ గ్రేడ్ రూ.2389.00 , కంది 8000.0, పెసర 8768.00, మినుము 7800.00,నువ్వులు 9846.00 ప్రొద్దుతిరుగుడు 7721.00, సజ్జ 2775.00 జొన్న 3699.00, మొక్కజొన్న 2400.00 వేరుశనగ 7263.00.కావున రైతులు నీటి వసతినీ బట్టి పైన తెలియపరచిన పంటలను సాగు చేసి మంచి ఆదాయాన్ని పొందవచ్చు అని తెలిపారు, మండలంలో సాగు చేసే పంటలకు ఖరీఫ్ సీజన్ కి సంబంధించి ఇన్సూరెన్స్ చేసుకోవాలని (ఎకరాకు) వరికి రూ.860.00 కంది రూ .430.00 , సజ్జ రూ.156.00 మినుము రూ .205.00 నువ్వులు రూ .180.00 మరియు ఎర్ర మిరపకు రూ.4500.00 దీనికి సంబంధించి ప్రకాశం జిల్లాలో ఇ సి ఐ సి లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ అనే ఇన్సూరెన్స్ కంపెనీకి రైతులు మీ ప్రీమియం జూలై 31లోపల, వరికి మాత్రం ఆగస్టు 15తేదీ లోపల ప్రీమియం చెల్లించాలని తెలియజేసారు.తదుపరి పూత దశలో ఉన్న నువ్వు పంటను పరిశీలించి వేపనూనె 10మి.లీ క్లోరో పైరిఫాస్ 2.5 మీ. లీ.ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసి మొదటి దశ పురుగు నివారించుకోవచ్చునని తెలిపారు.చౌటపాలెం పశు వైద్యాధికారి డాక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ పశు పోషకులకు పశువులలో వచ్చు వ్యాధులు గురించి వివిధ పథకాలు గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో చెరుకూరు గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్.సబీహ ముండ్లమూరు వారి పాలెం గ్రామ వ్యవసాయ సహాయకులు డి.దివాకర్, మరియు రెండు గ్రామాల పశు వైద్య సహాయకులు కే.హరీష్, షేక్.షాన్ మీన్ ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ముసుగులో రావూరు రైతులను నట్టేట ముంచొద్దు

### రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి హెచ్చరిక -పరిశ్రమల కోసం మా భూములు ఇవ్వం: రావూరు రైతులు



**గుడ్లూరు, పెన్ పవర్, జూలై 22**

బలవంతపు భూసేకరణను నిరసిస్తూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి మండలంలోని రావూరు గ్రామంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా రావూరు రామాలయం గుడి దగ్గర సభ నిర్వహించారు. ఈ సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ అభివృద్ధి ముసుగులో రాష్ట్రంలో పెద్ద ఎత్తున భూదోపిడి జరుగుతుందని, అందులో భాగంగానే రావూరు గ్రామంలో కూడా భూదోపిడీ జరుగుతుందని, ఆయన అన్నారు. పేదలను కొట్టి పెద్దలకు పెట్టె విధంగా, రైతుల భూములు కారు చౌకగా బలవంతంగా తీసుకొని, కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడానికి మేము సహించమని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. రావూరు గ్రామంలో ప్రజలు ఏకగ్రీవంగా మేము భూములు ఇవ్వము అని అంటుంటే, ప్రభుత్వం వీరిపై ఒత్తిడి చేయడం సరైనది కాదన్నారు. 2013 చట్టంలో 80 శాతం మంది ప్రజలు, అభిప్రాయాలకు అనుగుణంగా వెళ్లాలని ఉందని, కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, కార్పొరేట్ల కనుకూలంగా, చట్ట సవరణ చేయడం రైతులను నాశనం చేయడానికే అని ఆయన అన్నారు. గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు, 2013 చట్టానికి సవరణలు చేశారని ఆయన తెలిపారు. 2013 చట్టం రైతులకు కవచం లాంటిది అన్నారు. మహాభారతంలో, కర్ణుడికి కవచకుండలాగా, 2013 చట్టం ఉందని, కర్ణుడిని చంపడానికి కవచకుండాలు తొలగించి హతమార్చిన విధంగానే, 2013 చట్టం కు సవరణలు చేసి రైతులను హతమారుస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేద రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రజలకు, హాని తలపెట్టాలని చూస్తే సహించమని, పెద్ద ఎత్తున రైతాంగ పోరాటాలు, కరేడులో జాతీయ రహదారిని దిగ్బంధం చేసిన రీతిలోనే జరుగుతాయని ఆయన ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రావూరు గ్రామంలో బలవంతపు భూసేకరణ వెంటనే ఆపేయాలని, ఇచ్చిన నోటిఫికేషన్ ను వెనక్కి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో 50వేల ఎకరాలు పరిశ్రమ కోసం తీసుకున్నారని, పదివేలలోనే పరిశ్రమలు పెట్టారని, మిగతా 40000 ఎకరాలు కార్పొరేట్లకు కట్టబెట్టారని, కార్పొరేట్లు, బ్యాంకుల్లో తాకట్టుపెట్టి, బ్యాంకులను దివాలా తీయించారని ఆయన అన్నారు. రాష్ట్రంలో భూసేకరణ జరిగిన ప్రాంతాల్ని పరిశీలన చేస్తే ఎక్కడ కూడా పరిశ్రమలు లేవు, ఎవరికి ఉద్యోగాలు రాలేదు, రైతుల భూములు తీసుకొని, కూలీలుగా మార్చి తీసుకున్న గ్రామాలను స్మశానాలుగా మార్చడమే తప్ప అభివృద్ధి అంటూ ఏదీ లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మూలి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, తాళ్లూరి మాల్యాద్రి, తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో, చేవూరు గ్రామ రైతులు, గ్రామ సర్పంచి గొల్లపోలు సుబ్బరామయ్య, బిట్రగుంట ప్రసాద్, బాలిబోయిన వెంకట్రావు, వైస్ ప్రెసిడెంట్ మిరియం కామయ్య, నీటి సంఘం ప్రెసిడెంట్ సుబ్బారావు, బండారు రామారావు, మిరియం జయరామయ్య, గొల్లపోలు చిన్న తదితరులు పాల్గొన్నారు.

## పేదలను అభివృద్ధి చేయడమే పి ఫోర్ విధాన లక్ష్యం





**అర్ధవీడు, పెన్ పవర్, జులై 22**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము పేదలను ఆదుకునేందుకు పి ఫోర్ విధానాన్ని అమలు చేస్తుంది. పబ్లిక్ ,ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్షిప్ విధానం ద్వారా పేదలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ఈ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తుందని విఆర్ ఓ వీరయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 మార్చి ఉగాది సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. తిరుపతిలో చేసిన "ప్రజా వేదిక" సమావేశంలో సీఎం మార్గదర్శులతో కలిసి బంగారు కుటుంబాలతో సమావేశమయ్యారు. 15%--20%?లక్షల కుటుంబాలను మద్దతు ఇవ్వడం కోసం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 2029 నాటికి ఆంధ్రప్రదేశ్ను పేదరిక రహిత రాష్ట్రంగా మార్చడం ముఖ్యమంత్రి లక్ష్యమని అన్నారు. పి 4 అనేది ప్రాజెక్ట్ ద్వారా పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్న ప్రజాసహకార పథకంగా అభివృద్ధి చెందుతుంది. ఈ కార్యక్రమంలో మొహిద్దీన్ పురం పంచాయతీ కార్యదర్శి ఎం వెంకటేశ్వరరావు, బోగోలు పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు , మొహిద్దిన్ పురం వెల్ఫేర్ అసిస్టెంట్ జోష్న గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుడ్లూరు ఎంఆర్సీని సందర్శించిన జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటసుబ్బయ్య



**గుడ్లూరు, పెన్ పవర్, జులై 22:**

మండల కేంద్రమైన గుడ్లూరులో ఉన్న ఎం.ఆర్.సీ కేంద్రాన్ని నెల్లూరు జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ డీ.వెంకటసుబ్బయ్య మరియు ఏ.ఎం.ఓ సుధీర్ బాబులు మంగళవారం సందర్శించారని ఎంఈఓ ఎం.గోవర్ధన్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులకు కావలసిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నూతనంగా ఏర్పాటైన మోడల్ ప్రైమరీ స్కూల్స్ లో కావలసిన మౌలిక వసతుల కల్పనకు కావలసిన రిపోర్ట్ తయారు చేసి త్వరగా పంపించాలని ఎంఈఓ గోవర్ధన్ ను ఆదేశించారు. అనంతరం కార్యాలయంలో వున్న పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఎంఈఓ గోవర్ధన్ తో పాటు ఎం.ఐ.ఎస్ సీహెచ్ మల్లికార్జున, డేటా ఆపరేటర్ నరాల శివకుమార్ తదితరులు ఉన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్ భూపాల్ రెడ్డిని సన్మానించిన ఎంపీటీసీలు సర్పంచులు

**బెస్తవారిపేట, పెన్ పవర్ జూలై 22:**

కంభం మార్కెట్ చైర్మన్ పూనూరు భూపాల్ రెడ్డిని బేస్తవారిపేట మండలంలోని అధికారులు ప్రజాప్రతినిధులు మంగళవారం సన్మానించారు. కంభం మార్కెట్ యార్డ్ ఏర్పడిన నాటినుండి రాష్ట్రములో ఏ ప్రభుత్వం ఉన్నప్పటికీ బేస్తవారిపేట మండలానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కలేదు. మార్కెట్ యార్డ్ ఏర్పడి దాదాపు 30 సంవత్సరాల కావస్తున్న మొట్టమొదటిసారిగా బేస్తవారిపేట మండలానికి చెందిన పూనూరు భూపాల్ రెడ్డి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి దక్కడముతో ఆయనను ప్రతి ఒక్కరూ అభినందించారు. మంగళవారం మండల సర్వసర సమావేశంలో పూనూరు భూపాల్ రెడ్డి పాల్గొనడంతో ఆయనకు బేస్తవారిపేట మండల స్థాయి అధికారులు,మండలంలోని సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు ఘనంగా శాలువాలు, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భూపాల్ రెడ్డి మాట్లాడుతూ తనను సన్మానించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



# ప్రాథమిక పాఠశాలలో జస్వంత్ పుట్టినరోజు వేడుకలు





**పొన్నలూరు,పెన్ పవర్ జులై 22**

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం గ్రామంలో మంగళవారం తుమాటి మధుబాబు శ్రీలక్ష్మి కుమారుడు జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థుల మధ్య ఘనంగా జరుపుకున్నారు.పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచి పెట్టారు.అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ మాట్లాడుతూ జస్వంత్ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించడం ఎంతో అభినందనీయమని జస్వంత్ తల్లిదండ్రులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పోరాట యోధుడు అచ్యుతానంద: సిపిఎం




**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జులై 22**

కేరళ మాజీ ముఖ్యమంత్రి, సిపిఎం మాజీ పోలిట్ బ్యూరో సభ్యులు వి ఎస్ అచ్యుతానందన్ 101 సంవత్సరాల వయసులో, అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతికి సంతాపం తెలియజేస్తూ మార్కాపురం పట్టణంలోని సిపిఎం కార్యాలయం నందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి సోమయ్య మాట్లాడుతూ కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా కేరళ రాష్ట్ర ప్రజలకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. సిపిఎం పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన అచ్యుతానంద్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. కేరళ రాష్ట్రానికి తనదైన ముద్ర వేసే విధంగా స్థానిక సంస్థలకు సంపూర్ణ హక్కులు కల్పించడం, అక్షరాస్యతలో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడంలో ఆయన పాత్ర మరువలేనిదని, 17 సంవత్సరాలకే పార్టీ సభ్యత్వం తీసుకొని, అంచలంచెలుగా కొబ్బరి పీచు కంపెనీలో కార్మికుడిగా కార్మిక నాయకుడిగా పనిచేస్తూ ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగాడని అన్నారు. , వ్యవసాయ కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు నడిపారని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి కె యం రఫీ, మండల కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, జవాజి రాజు, అడివయ్య, ఏనుగుల సురేష్, షేక్ మహబూబ్ బాషా, మల్లికార్జున, జి చెన్నకేశవులు, సుబ్బారావు, వి శ్రీనివాసరెడ్డి, ఏ.వీరారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రాజుపాలెం కేజీబీవీ లో టీ బీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహణ

## విద్యార్థులకు ఉపాధ్యాయులకు టి బి వ్యాధిపై అవగాహన కల్పించిన టీబీ యూనిట్ సూపర్వైజర్ రవీంద్రనాథ్ రెడ్డి

**కొమరోలు పెన్ పవర్ జులై 22**

కొమరోలు మండలం రాజుపాలెం లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం గిద్దలూరు టీబీ యూనిట్ సూపర్వైజర్ రవీంద్రనాథ్ రెడ్డి, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని హసీనా ఆరా విద్యార్థులకు ఉపాధ్యాయులకు టీబీ వ్యాధిపై అవగాహన కల్పించారు .ఆ సందర్భంగా సూపర్వైజర్ రవీంద్ర నాథ్ రెడ్డి మాట్లాడుతూ, రెండు వారాలపాటు తీవ్రమైన దగ్గు ,జ్వరం ,బరువు తగ్గటం ,ఛాతిలో నొప్పి రావడం, తగ్గినప్పుడు గళ్ళలో రక్తం పడడం, లాంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి గళ్ళ పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు .ప్రతి గ్రామంలో 60 సంవత్సరాల వయసు నిండిన వృద్ధులు ,షుగర్ వ్యాధితో బాధపడేవారు ,పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపంతో ఉన్నవారితోపాటు, గత ఐదు సంవత్సరాలుగా టీబీ వ్యాధితో బాధపడుతున్న వారు , ఆ కుటుంబంలోని వ్యక్తులను గుర్తించి సర్వే చేయనున్నట్లుగా ఆయన తెలిపారు. కావున ఉపాధ్యాయినీలు ,బాలికలు టీబి వ్యాధి లక్షణాలపై అవగాహన పెంచుకొని ఆ వ్యాధి లక్షణాలు గల వారిని , వ్యాధి సోకి బాధపడే వారిని గుర్తించి తమకు తెలియజేయాలని ఆయన కోరారు, ఆ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపాల్ రోజ్ సులోచన, ఉపాధ్యాయినీలు, బోధ నేతర సిబ్బంది, రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ ముంతాజ్, రజిని, వెంకటలక్ష్మి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# నాలుగవ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో శ్రీ గాయత్రి అద్భుత ఫలితాలు



Guttikonda. Lakshmi Narasimha



Gurrapusala. Deepika



Chavalam. Rajesh



Palanki. Akhila



Nelapati. Akhila



Shaik. Mohaseen

**కందుకూరు పెన్ పవర్, జూలై 22:**

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ నాలుగవ సెమిస్టర్ డిగ్రీ పరీక్ష ఫలితాలలో శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల విద్యార్థిని, విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సిహెచ్ రామ కృష్ణారావు తెలిపారు. బీసీఏ(సిఎస్సి) విభాగమునందు గుర్రపుసాల దీపిక 95శాతం తో కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. బీకాం కంప్యూటర్స్ లో గుత్తికొండ లక్ష్మీనరసింహ 89శాతం తో కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. బిఎస్సి మ్యాథమెటిక్స్ విభాగము నందు నేలపాటి అఖిల 88 శాతం తో కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. బీఎస్సీ బోటనీ విభాగమునందు షేక్ మొహసిన్ 91శాతం తో కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. బీకాం జనరల్ విభాగము నందు పాలంకి అఖిల 78శాతం కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. బిఎ విభాగమునందు చవలం రాజేష్ 81శాతం పర్సంటేజ్ తో కాలేజీ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు.పై అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను శ్రీ గాయత్రీ విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్. రామకృష్ణారావు, విద్యాసంస్థల డైరెక్టర్ సిహెచ్ భరద్వాజ్ , శ్రీ గాయత్రి విద్యా పరిషత్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వి ఉషా చంద్రిక, శ్రీ గాయత్రి డీన్ పి. వెంకటేశ్వర్లు, శ్రీ గాయత్రి విద్యా పరిషత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి గీతా శ్రీనివాసరావు , అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# పందలపాడులో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం

## - టిడిపి అధికార ప్రతినిధి గోచిపాతల మోషే



**కందుకూరు పెన్ పవర్, జూలై 22**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి రథసారధిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాల్గవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత పరిపాలన మొదలుపెట్టి సంవత్సరకాలం పూర్తైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు , అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల నుంచి విలువైన సమాచారాన్ని సేకరించాలనే ఆలోచన విధానంతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మొదలుపెట్టారని మోషే అన్నారు. దానిలో భాగంగా పందలపాడు గ్రామంలో స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు కూనం లక్ష్మీనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో డోర్ టు డోర్ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సారథ్యంలో నడుస్తున్నటువంటి ప్రభుత్వం పేదప్రజల పట్ల అవగాహనతో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని , గత 5 సంవత్సరాల కాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో చిన్నా బిన్నమైన రాష్ట్ర అభివృద్ధిని గాడిలో పెడుతున్నారని అటువంటి పరిపాలన దక్షత కలిగిన నాయకుడు పాలనలో మనం ఉండటం మన అదృష్టంగా భావిస్తున్నామని మోషే గుర్తుచేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం , మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు , ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచడంతో పాటు ఆగస్టు 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు మహిళల ముఖాలలో ఆనందోత్సవాలు విరుజిల్లుతున్నాయని మోషే మీడియాకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు కూనం లక్ష్మీనారాయణ రెడ్డి , గ్రామ పార్టీ నాయకులు కంజుల రామచంద్రారెడ్డి , కందుకూరు నియోజకవర్గం తెలుగుయువత కార్యదర్శి వర్ల జోసఫ్ కిషోర్ , గౌడపేరు నరసింహారావు , వర్ల యాకోబు , వర్ల ఇస్సాకు , కందుకూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ 4వ సెమిస్టరు ఫలితాలలో శ్రీ వివేక డిగ్రీ కళాశాల విజయభేరి



CH.NEERAJA BCA 1ST 89%



P.ANITHA BCA 2ND 88%



K. AKHIL BCA 3rd 85%



P.SRIHITHA BSC 1ST 92%



SRAVANI BCOM COMPUTERS 1ST 90%



A. JOICE MERY 2nd 88%



G.NIKHITHA 3RD 87%



P.NARESH BSC 2nd 90%

**కందుకూరు పెన్ పవర్, జూలై 22:**

ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ప్రకటించిన నాలుగవ సెమిస్టర్ డిగ్రీ ఫలితాలలో కందుకూరు శ్రీ వివేక డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారని కళాశాల చైర్మన్ ఉన్నం భాస్కర్ రావు తెలిపారు. బీసీఏ లో చింతపల్లి నీరజ (89శాతం) ,అనిత (88శాతం), అఖిల్ (87శాతం), బీకాం కంప్యూటర్ లో..జడ శ్రావణి (83శాతం), మేరీ (81శాతం), నిఖిత (81శాతం) బిఎస్సి కంప్యూటర్ లో శ్రీయుత (92శాతం), నరేష్ (90శాతం), మైత్రి(85శాతం) సాధించినట్లు తెలిపారు. అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను,కృషి చేసిన ఉపాధ్యాయులను బి ఆర్ ఆక్స్ ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి. బాల భాస్కరరావు, బి.నరేంద్ర బాబు, కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, డి.శ్రీనివాసులు, తదితర ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

## - ఒంగోలు మునిసిపల్ కమిషనర్



**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జూలై 22**

డిటిపిసి నిబంధనల మేరకు అనుమతి లేకుండా ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలో ఫ్లెక్సీలను ఏర్పాటుచేయరాదని ఒంగోలు నగర పాలక సంస్థ కమిషనర్ డా.కోడూరి వెంకటేశ్వర రావు చెప్పారు. మునిసిపల్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్లెక్సీ సెంటర్లు, కమర్షియల్ షాపుల యజమానులకు, ఇతర వ్యాపారస్తులకు, రాజకీయ ప్రజా ప్రతినిధులు నగరపాలక సంస్థ పరిధిలోని జంక్షన్ల యందు, సెంటర్ డివైడర్లు యందు, విగ్రహాల కూడలి యందు, ముఖ్యమైన ప్రాంతములలో ఫ్లెక్సీలు, అడ్వర్టైజ్మెంట్ బోర్డులు ఏర్పాటుచేయరాదని స్పష్టం చేశారు. ఒంగోలు నగరపాలక సంస్థ యందు పై తెలిపిన ప్రాంతములు తప్ప నగరపాలక సంస్థ ప్రత్యేకంగా కేటాయించిన ప్రాంతములలో మాత్రమే ముందస్తు అనుమతి తీసుకొని ఫ్లెక్సీలు, అడ్వర్టైజ్మెంట్ బోర్డులను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ముందస్తు అనుమతి తీసుకొననీ యెడల నగరపాలక సంస్థ సిబ్బందిచే తొలగించబడి అందుకు అగు ఖర్చులు కూడా వసూలు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు -సీఐ సుబ్బారావు

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 22**

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మార్కాపురం సిఐ సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక కార్ స్టాండ్ లోని డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాల నివారణ, సీసీ కెమెరాల ఆవశ్యకతపై సీఐ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయంలో వాహనాలు నిలిపి ఉండటం వల్లనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డుపై వాహనాలు ఆపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, వాహనాలు నడిపే సవ యంలో సీటు బెల్టు ధరించాలని సూచించారు.



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# ట్రాఫిక్ రూల్స్‌పై స్పెషల్ డ్రైవ్





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 22**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఏ.ఆర్. దామోదర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మార్కాపురం టౌన్, పలు ప్రాంతాలలో డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో మొత్తం 106 పెండింగ్ చలానాలపై రూ.22,440/- జరిమానా, అలాగే, 2 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేయడం జరిగింది. మాడిఫైడ్ సైలెన్సర్లు ఉన్న ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటికి కంపెనీ వారు చెందిన అసలు సైలెన్సర్లు అమర్చేలా చర్యలు తీసుకున్నారు. నెంబర్ ప్లేట్లు లేని 8 ద్విచక్ర వాహనాలను గుర్తించి, వాటికి నెంబర్ ప్లేట్లు వేయించేందుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మార్కాపురం డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి



వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని స్పష్టం చేశారు. మాడిఫైడ్ చేసిన సైలెన్సర్లు వాడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ ధరించని వారి పై మోటారు వాహనాల చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా జరుగుతుందన్నారు. వాహనదారులు రోడ్డుపై ప్రయాణించే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్ ధరించడం ద్వారా మీ భద్రతతో పాటు మీ కుటుంబం ఆనందాన్ని కూడా కాపాడవచ్చని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మార్కాపురం సీఐ సుబ్బారావు, టౌన్ ఎస్సైలు ఎం. సైదులు బాబు, డాక్టర్ ఎం. రాజమోహన్ రావు, ట్రాఫిక్ ఎస్సై అహరోన్, రూరల్ ఎస్సై అంకమ్మ రావు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో ఉన్న వేతనాలు విడుదల చేయాలి

### పీఎఫ్ అమౌంటును ఖాతాలలో జమ చేయాలి -సిఐటియు డిమాండ్



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జులై 22**

ఏపీ గవర్నమెంట్ హాస్పిటల్ శానిటరీ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల వేతనాలు, కార్మికుల పీఎఫ్ ఖాతాలో వేతనంలో కట్ చేసిన నగదును వెంటనే జమ చేయాలని స్థానిక ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి కె యం రఫీ మాట్లాడుతూ నాలుగు నెలలుగా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా కార్మికుల చేత చాకిరీ చేయించుకుంటున్నారని,పెండింగ్ లో ఉన్న కార్మికుల నాలుగు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ ఇచ్చే వేత్తనాన్ని కూడా నెల నెల ఇవ్వకుండా నెలల తరబడి కార్మికులకు వేతనాలు పెండింగ్లో ఉంచడానికి ఆయన ఖండించారు. వేతనాలు చెల్లించకుండా కార్మికుల చేత పనిచేస్తున్న ఫస్ట్ ఆబ్జెక్టివ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజెన్సీ విజయవాడ తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుల వేతనాలు నుండి పిఎఫ్ పేరుతో అమౌంట్ కట్ చేస్తూ వారి పిఎఫ్ ఖాతాలకు జమ జమ చేయకుండా, కాంట్రాక్టర్ షేర్ ను కూడా జమ చేయడం లేదని అన్నారు. పిఎఫ్ సంబంధించిన ఎటువంటి సమాచారాన్ని కాంట్రాక్టర్ అందించకుండా కార్మికులను ఇబ్బందుల గురిచేస్తున్నారని అన్నారు. జీతాలు అందకపోవడంతో కుటుంబాలు గడవక అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారని అన్నారు. హాస్పిటల్లో రోగుల కు హాస్పిటల్ ను శుభ్రం చేస్తూ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు జీతాలు అందకపోవడంతో సరైన ఆహారం లేక కార్మికుల కుటుంబాలు అనేక రోగాల గురవుతున్నాయని ఆయన ఆవేదన చెందారు. హాస్పిటల్ సూపర్నెంట్ కు పలుమార్లు విన్నవించుకున్న సమస్య పరిష్కరించలేకపోయారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కార్మికులకు పెండింగ్లో ఉన్న జీతాలు పిఎఫ్ సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈనెల చివరికి పెండింగ్ వేతనాలు ఇవ్వనిచో ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కే రూబెన్, అందే సురేష్ స్వప్న, బాలకృష్ణ, కొండమ్మ మల్లికార్జున, మీరంబి, నాగమణి, నూర్జహాన్, అరుణ, రవణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## బడి బయట పిల్లలు లేకుండా చూడాలి

### మోడల్ ప్రైమరీ స్కూల్లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుంది

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జులై 22:**

బడి ఈడు కలిగిన పిల్లలు కచ్చితంగా పాఠశాలలో ఉండాలని కర్లపాలెం మండల విద్యాశాఖ అధికారి 2 ఎన్. విజయశ్రీ అన్నారు. మంగళవారం స్థానిక కర్లపాలెం మోడల్ ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు పై సమీక్ష జరిపారు. మండల పరిధిలో ఉన్న 6 మోడల్ ప్రైమరీ స్కూల్స్ కావలసిన సౌకర్యాలను, సామాగ్రిని స్థానిక ఇంజనీరింగ్ అసిస్టెంట్, స్థానిక ప్రధానోపాధ్యాయుతో సమీక్ష జరిపి వాటిని ఆన్లైన్ పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎంఈఓ గారు మాట్లాడుతూ స్థానిక కమిటీల ద్వారా మాట్లాడి అన్నిటిని సమకూర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి .విజయశ్రీ, జి శ్రీనివాసరావు, డి నవీన్, జి రామారావు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## కొమరోలులోని హైస్కూళ్లను సందర్శించి తనిఖీ చేసిన జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్

**ఎంఈఓ లకు ,హెడ్మాస్టర్లకు, ఉపాధ్యాయులకు సూచనలు సలహాలు ఇచ్చిన డిఇఓ**

**గోపానిపల్లి లోని ఏబీఎం పాఠశాలల పనితీరును తప్పు పట్టిన డీఈవో**

**కొమరోలు ప్రభుత్వ హైస్కూల్లో 84 మంది టెన్త్ విద్యార్థులు ఫెయిల్ కావడంపై ఆగ్రహం, విచారం వ్యక్తం చేసిన డిఇఓ**






**కొమరోలు పెన్ పవర్ జూలై 22**

ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారి అత్తోటి కిరణ్ కుమార్ మంగళవారం కొమరోలు మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్ లను ఎయిడెడ్ విద్యాసంస్థలను సందర్శించి, తనిఖీ చేశారు .కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో ఇటీవల జరిగిన ఒక సంఘటనపై జిల్లా కలెక్టర్ కు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో విచారణ చేయు నిమిత్తం మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ కొమరోలు కు వచ్చారు. ఆ సందర్భంగా ఆయన కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల పనితీరు, సమయపాలన, విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, విద్యార్థుల హాజరు శాతం పై తీసుకుంటున్న చర్యలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో చర్చించారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,,ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయులు సమన్వయంగా పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్యాబోధన అందించాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు కేవలం తరగతి గదులలో పాఠాలు చెప్పడంతోనే వారి బాధ్యత తీరిపోదని ,విద్యార్థుల హాజరు శాతం పై కూడా దృష్టి సాధించాలని కోరారు. విద్యార్థులు తరచుగా పాఠశాలకు ఎందుకు హాజరు కాలేకపోతున్నారో తెలుసుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులతో ఫోన్ ద్వారా సంప్రదిస్తూ ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలకు అధికంగా పేద విద్యార్థులే వస్తుంటారని ,అందువల్ల వారి ఉజ్వల భవిష్యత్తుకు, తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చేందుకు కృషి చేయాలని కోరారు . ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన 10వ తరగతి పరీక్షలలో కొమరోలు లోని ప్రభుత్వ హైస్కూల్లో టెన్త్ పరీక్షలలో 84 మంది విద్యార్థులు ఫీల్ కావడం అందులో 81 మంది విద్యార్థులు గణితం సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేకపోవడం పై ఆయన తీవ్ర ఆగ్రహం ఆవేదన వ్యక్తం చేశారు .ఐదు సంవత్సరాల పాటు విద్యార్థులకు గణితంలో విద్యాబోధన చేసినప్పుడు, కనీసం టెన్త్ పరీక్షలలో 35 మార్కులతో పాస్ కాలేకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. గతంలో ఇదే పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడిగా పనిచేసిన అశ్విని కుమార్ కు సంజాయిషీ నోటీసులు అందజేసి ఆయన వివరణ కోరనున్నట్లుగా డీఈవో తెలిపారు. అశ్విని కుమార్ ప్రస్తుతం తురిమెళ్ళ ప్రభుత్వ హైస్కూల్లో పనిచేస్తున్నట్లుగా గుర్తించామని, అయినప్పటికీ అశ్విని కుమార్ నుంచి వివరణ తప్పనిసరిగా కోరనున్నట్లుగా ఆయన తెలిపారు .ప్రస్తుతం కొమరోలు లోని ప్రభుత్వ హై స్కూల్లో మంచి అనుభవం అర్హత గల ఉపాధ్యాయులు పనిచేస్తున్నట్లుగా గుర్తించామని ,అందువల్ల గత ఏడాది జరిగిన తప్పిదం మరోసారి జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిఇఓ పేర్కొన్నారు. ఆ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కే వెంకటేశ్వర్లు బి వెంకటరత్నం లకు ప్రభుత్వం హై స్కూల్ హెడ్మాస్టర్ శివ నాగేశ్వరరావుకు తమ సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన కొమరోలు లోని ఎస్బిఎన్ఆర్ఎం విద్యాసంస్థలను, గోపానిపల్లి లోని ఏబీఎం విద్యాసంస్థలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఆయన పాఠశాలలకు సంబంధించిన రికార్డులను , ఉపాధ్యాయుల వివరాలను, విద్యార్థుల హాజరు శాతాన్ని, పాఠశాలల్లో అమలు జరుగుతున్న విద్యాబోధన మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలను తనిఖీ చేశారు. కాగా గోపాని పల్లె లోని ఏబీఎం విద్యాసంస్థల పనితీరుపై డివో తీవ్ర ఆగ్రహం ,విచారం వ్యక్తం చేశారు. ఏబీఎన్ హై స్కూల్లో ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు కేవలం 8 మంది విద్యార్థులు ఉండగా , ఒక తెలుగు పండిట్, ఒక హిందీ పండిట్ తో పాటు ఒక ఎస్జీటీ ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారని గుర్తించామన్నారు. ఆ పాఠశాలలో 75 మంది విద్యార్థులు ఉన్నట్లుగాను, వారిలో మంగళవారం 43 మంది విద్యార్థులు హాజరైనట్లుగాను, వారి 21 మందికి మధ్యాహ్నం భోజనం అందించినట్లుగా తప్పుడు సమాచారంతో రిజిస్టర్లలో నమోదు చేశారని ఆయన తెలిపారు. అలాగే ఏబీఎం ప్రాథమిక పాఠశాలలో కేవలం నలుగురు విద్యార్థులు ఉండగా ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని ,అయితే ప్రాథమిక పాఠశాలలో 93 మంది విద్యార్థులు ఉన్నట్లుగాను వారిలో 47 మంది మంగళవారం హాజరైనట్లుగాను ,22 మందికి మధ్యాహ్నం భోజనం అందించినట్లుగా తప్పుడు వివరాలు నమోదు చేశారని ఆయన ఆగ్రహం చేశారు. తప్పుడు సమాచారం అందిస్తూ అధికారులను తప్పుదోవ పట్టించడమే కాకుండా ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేస్తున్న ఏబీఎం విద్యాసంస్థలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారులు కూడా తరచుగా పాఠశాలలను సందర్శిస్తూ తనిఖీలు చేస్తూ ఉండాలని జిల్లాలోని అన్ని పాఠశాలల విషయాలు జిల్లా కేంద్రంలో ఉన్న తాను ఎలా పర్యవేక్షిస్తూ ఉండగలనని ఆయన ఎంఈఓ లను ప్రశ్నించారు. ఎస్ బిఎన్ ఆర్ ఎం విద్యాసంస్థలలో నిర్వహిస్తున్న స్కూలు బస్సుల కండిషన్, సర్టిఫికెట్లు, డ్రైవర్ల లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు తదితర వివరాలను తనకు అందజేయాలని ఆయన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తాను కొమరోలు ప్రభుత్వ హైస్కూల్లో నిర్వహించిన విచారణ కు సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్కు సమగ్ర నివేదిక ద్వారా అందజేస్తానని ఆయన తెలిపారు. ఆ కార్యక్రమంలో కొమరోలు మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు వెంకటరత్నం సిఆర్పిలు రామాంజి పుల్లయ్య ఆదినారాయణ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## భారత కమ్యూనిస్టు పార్టీ కారంపూడి మండల కమిటీ సమావేశం



**పెన్ పవర్ కారంపూడి జులై 22**

కారంపూడి పట్టణంలోని ఈరోజు ఆదినారాయణ కాలనీలో కమిటీ సమావేశం జరిగినది. ఈ కార్యక్రమం గురించి కారంపూడి మండల కార్యదర్శి షేక్ సైదా మాట్లాడుతూ ఈనెల 29వ తారీఖున మన మాచర్ల నియోజకవర్గం సిపిఐ పార్టీ మహాసభలు జరుపుటకు నిర్ణయించడమైనది భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బడుగు బలహీన వర్గాల కోసం పేద ప్రజల కోసం ఎనలేని కృషి చేసిందన్నారు 100 సంవత్సరాల చరిత్ర కలిగిన భారత కమ్యూనిస్టు పార్టీ మన పల్నాడులో మాచర్ల నియోజకవర్గం లో పేదల కోసం ఇళ్ల స్థలాల కోసం పెన్షన్లు సాగు భూముల కోసం ఎన్నో త్యాగాలు చేసిందన్నారు అలాంటి పార్టీ మహాసభలో ఈనెల 29వ తారీఖున మన మాచర్ల పట్టణంలో జరుగుతున్నది కావున కారంపూడి మండల సిపిఐ నాయకులు కార్యకర్తలు అందరూ కూడా ఈ మహాసభను జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము. ఈ కార్యక్రమంలో కారంపూడి పట్టణ సిపిఐ కార్యదర్శి సూరె హనుమంతరావు సహాయ కార్యదర్శి జింకల వెంకట కోటేశ్వరరావు కారంపూడి మండల సహాయ కార్యదర్శి మేకపోతి చిన్న కోటిరెడ్డి మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి ఏకే నాగమణి ఒప్పిచర్ల శాఖ కార్యదర్శి ఇందూరు శ్రీనివాసరావు మొదలగు వారు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యమే ప్రథమ లక్ష్యం- ఎమ్మెల్యే నసీర్



**పెన్ పవర్, గుంటూరు, జులై.22**

ఇది ప్రజలు మెచ్చిన ప్రభుత్వమని, అందుకే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుల వారి కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.70,72,179 విలువైన చెక్కులను ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. వీటిలో సీఎంఆర్ ఎఫ్ రూ.40,57,179, ఎల్వోసీ(వైద్యానికి ముందస్తు నిధులు) రూ.30.15 లక్షలు ఉన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ పండ్ ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజారోగ్యాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. కనీసం సీఎం రిలీఫ్ ఫండ్ కూడా అందించకుండా పేదల జీవితాలతో ఆడుకున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వైద్య రంగానికి పెద్ద పీట వేశారని, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్నామని వెల్లడించారు. తమ వద్దకు వచ్చిన బాధితులకు ఓదార్పుగా నిలవడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.3.50 కోట్ల నిధులు అందజేశామని, ఇది తమ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఆస్పత్రుల్లో లక్షల రూపాయల ఖర్చయ్యాయని, అప్పుల్లో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే నసీర్ ను సంప్రదించిన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే నసీర్ కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

## పనుల్లో నాణ్యత ఉండాలి

### ఎమ్మెల్యే నసీర్.



**పెన్ పవర్, గుంటూరు, జులై.22**

గుంటూరు నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతగా, వేగవంతంగా పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ సూచించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం స్థానిక శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు నిర్మాణాలను పర్యవేక్షించాలని చెప్పారు. పనులు ఎంత వరకు పూర్తయ్యాయి ? ఇంకా ఎంత శాతం పూర్తవ్వాలి ? ఎన్ని రోజులు సమయం తీసుకుంటుంది ? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. గుంటూరు నగరంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే భారీ ప్రాజెక్టులు చేపట్టామని, ఇవి గుంటూరు నగర ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. వీటి నిర్మాణంలో భాగస్వాములైన ఇంజనీరింగ్ అధికారులు బాధ్యతగా తీసుకోవాలని చెప్పారు.

# బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల అందజేత



**చీరాల,పెన్ పవర్,జూలై 22**

చీరాల మండలం కీర్తివారిపాలెం గ్రామం మసనం గోవిందు విద్యుత్ షాక్ తో మరణించగా వారి కుటుంబానికి 5 లక్షల రూపాయలు కంపెన్సేషన్ మంజూరు చేయించిన చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య. మంగళవారం చీరాల క్యాంపు కార్యాలయం నందు కంపెన్సేషన్ చెక్కును మసనం రమణాకి అందజేయడం జరిగింది. బాధితులు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య సీఎం నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యుత్ అధికారులు కీర్తివారిపాలెం గ్రామ నాయకులు, ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కొమ్మనబోయిన రజిని పాల్గొన్నారు.

పెన్ పవర్
గుంటూరు। బాపట్ల। పల్నాడు

# దొరికింది ఎరలే.. అసలు సొర చిక్కితేనే మద్యం కుంభకోణం ఆటకట్టినట్టు..

# పసుపుకుంకుమలు పోగొట్టుకొన్న ఆడబిడ్డలకు న్యాయం జరిగినట్టు...

**దశలవారీ మద్యనిషేధమని చెప్పి.. దశలవారీప్రణాళికతో వేలకోట్లు కొల్లగొట్టారు : ప్రత్తిపాటి**

**అధికారం శాశ్వతమన్న భ్రమతో అడ్డగోలుగా రాష్ట్రాన్ని లూటీ చేశారు**

**సాక్ష్యాలు.. ఆధారాలు రూపుమాపామని ఎప్పటికీ దొరకమని ఆనందించారు**

**కూటమిప్రభుత్వ రాకతో వైసీపీఅవినీతి, దోపిడీ పుట్టలు బద్ధలయ్యాయి**

**చంద్రబాబు నిష్పక్షపాత విధానాలు.. సిట్ సమగ్ర విచారణతో 'మద్యం' దొంగలు వరుసక్రమంలో చెరసాలబాట పడుతున్నారు**

**వైసీపీనేతలు ఇప్పటికైనా రెడ్ బుక్ రాజ్యాంగం... కక్షసాధింపులనడం మానేసి... చట్టప్రకారం నడుచుకొని తమ సచ్ఛీలతను నిరూపించుకోవాలి**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 22**

గత పాలకుల విచ్చల విడి అవినీతి.. విశృంఖల దోపిడీలో మద్యం కుంభకోణం చిన్న ఆవగింజంతే. సిట్ విచారణలో ఇప్పటివరకు దొరికింది చిన్నచిన్న ఎరలే..అసలు సొర చిక్కితేనే ఆల్కహాల్ కుంభకోణం ఆటకట్టినట్టు... కల్తీమద్యానికి బలైన వారి ఆత్మలకు శాంతి లభించినట్టు. రోడ్డునపడిన లక్షలాది కుటుంబాలకు న్యాయం జరిగినట్టు. పసుపుకుంకుమలు పోగొట్టుకొని జీవచ్ఛవాల్లా బతుకుతున్న ఆడబిడ్డలకు న్యాయం జరిగినట్టు. ఒక్కఛాన్స్ అని ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన జగన్ అండ్ కో వాటాలు..వంతుల వారీగా రాష్ట్రాన్ని లూటీ చేశారు. ముఖ్యంగా ఎన్నికలప్రచారంలో దశలవారీగా మద్యాన్ని నిషేధిస్తాననిచెప్పిన జగన్... 5 స్టార్ హోటళ్లలో తప్ప.... ఎక్కడా మద్యం దొరక్కుండా చేస్తానని.. ఆడబిడ్డల అన్నగా చెబుతున్నానంటూ ఊదరగొట్టాడు. పదవిలోకి రాగానే తన హామీని గాలికి వదిలేసి.. గాలికంటే వేగంగా తన అవినీతిని విశ్వవ్యాప్తం చేశాడు. గ్రాఫిక్స్ ను తలదన్నేలా షెల్ కంపెనీలు సృష్టించి.. లక్షలకోట్లు దేశం దాటించేశాడు.

**శాశ్వత 'పవర్' భ్రమలతో చేసిన పాపాల్ని శాశ్వతంగా తుడిచిపెట్టవచ్చని భ్రమించారు..**

అంతులేని తన ధనదాహానికి.. అధికారం దక్కడంతో జగన్ లోని లోని ధన పిపాసి నిద్రలేచాడు. ప్రజల.. ప్రభుత్వ ఆస్తులతో పాటు.. సహజవనరుల్ని చెరబట్టాడు. గుట్టుగా తన పనులు చక్కబెట్టేవారిని ఏరికోరి ఎంచుకొని మద్యం కుంభకోణానికి పథకరచన చేశాడు. చట్టం కళ్లుగప్పి చాకచక్యంగా ప్రజలసొమ్ము, రాష్ట్రసంపద కొట్టేశామని తమనెవరూ



ఏమీచేయలేరని జగన్ అండ్ కో ఐదేళ్లపాటు అమితానందించారు. రాజ్యాంగ పరిమితుల్ని.. న్యాయసూత్రాలను.. ప్రజాభిప్రాయాలను.. ప్రతిపక్ష పార్టీలు సహా వ్యవస్థల్ని ఖాతరుచేయకుండా పవర్ లో ఉన్నామని పేట్రేగిపోయారు. శాశ్వతంగా అధికారంలో ఉంటామన్న ఆశల్లో తేలియాడుతూ... చేసిన పాపాలను అంతే శాశ్వతంగా తుడిచిపెట్టవచ్చని భ్రమించారు. అరపైసా అవినీతిలేని అంశంలో అన్యాయంగా చంద్రబాబుని అరెస్ట్ చేసి.. తప్పుడుకేసులతో జైలుకు పంపిన వారు.. ఇప్పుడు తమదాకా వచ్చేసరికి నీతివాక్యాలు చెబుతున్నారు. ప్రజలెన్నుకున్న కూటమిప్రభుత్వ రాకతో వైసీపీఅవినీతి, దోపిడీ పుట్టలు బద్ధలయ్యాయి చంద్రబాబు ప్రభుత్వ పారదర్శక పాలన.. నిష్పక్షపాత విధానాలు.. సిట్ సమగ్ర విచారణతో మద్యం మాఫియా గుట్టు రట్టయింది. దాంతో బిక్కచచ్చిపోయిన వైసీపీ దొంగల ముఠా.. సాక్ష్యాలు రూపుమాపినా.. ఆధారాలు ధ్వంసంచేసినా ఎలా దొరికిపోయామా అన్న వేదనతో ఇప్పుడు గంగవెర్రులెత్తిపోతున్నారు. ఆపుకోలేని అక్కసు.. అదుపుతప్పిన ఆవేశంతో ప్రజాప్రభుత్వంపై విమర్శలు చేస్తూ... చేసిన పాపాల నుంచి ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేస్తున్నారు. అవినీతిపరుల్ని విడిచిపెట్టని చంద్రబాబు పట్టుదలతో.. కారాగారవాస భయంతో పాలకులపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమ అరెస్టులు..కక్షసాధింపుల్ని సమర్థిస్తూ నోటికొచ్చినట్టు మాట్లాడిన వారే.. ఇప్పుడు తమదాకా వచ్చేసరికి నీతివాక్యాలు చెబుతున్నారు. అరపైసా అవినీతిలేని అంశంలో అక్రమంగా అరెస్ట్ చేసి, తప్పుడుకేసులు మోపి, చంద్రబాబుని అన్యాయంగా జైల్లో పెట్టి వేధించి, రాక్షసానందం పొందిన వారే, ఇప్పుడు లబోదిబోమంటున్నారు. చేసిన తప్పులు... పాపాలు, ప్రజల కన్నీళ్లు.. మద్యం మహమ్మారికి రోడ్డునపడిన ఆడబిడ్డల ఆర్తనాదాలు తమను నీడలా వెంటాడుతాయనే కఠిన సత్యాన్ని వైసీపీ నేతలు ఇప్పటికైనా గుర్తించాలి. ప్రజల్ని నమ్మించవచ్చనే దుర్బుద్ధితో పదేపదే రెడ్ బుక్ రాజ్యాంగమంటూ నిందలు వేయడం మాని.. చట్టప్రకారంజరిగే పాలనకు.. న్యాయబద్ధమైన విచారణకు సహకరించి తమ సచ్ఛీలతను నిరూపించుకోవచ్చు. నిజంగా నీతిమంతులని రుజువైతే.. గతంలో మాదిరే ప్రజల్లోకి వెళ్లి మరలా వారి తీర్పుకోరవచ్చు. అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఒకప్రకటనలో సూచించారు.

# రోడ్ల ఆక్రమణలను తొలగించడంలో రాజీ లేదు, కమిషనర్ పులి శ్రీనివాసులు





**పెన్ పవర్, గుంటూరు, జులై.22.**

వర్షం నీరు, మురుగు సక్రమంగా పారుదలకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను నూరు శాతం తొలగించడానికి వార్డ్ సచివాలయాల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం నల్ల చెరువు మెయిన్ రోడ్ అన్న క్యాంటీన్ నుండి పీకల వాగు వరకు ఇరువైపులా పర్యటించి, డ్రైన్ మీద, ముందుకు ఉన్న ఆక్రమణలలను తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వర్షాకాలం దృష్ట్యా డ్రైన్లలో పూడికతీత పనులు చేపట్టామని, డ్రైన్లపై ఆక్రమణలు పనులకు ఆటంకంగా ఉన్నందున స్వచ్ఛందంగా తొలగించుకోవాలని పలుమార్లు ఆక్రమణదారులకు తెలిపినప్పటికీ తొలగించుకోవడం లేదన్నారు. ప్రధానంగా నల్లచెరువు మెయిన్ రోడ్ లో మేజర్ అవుట్ ఫాల్ డ్రైన్ పై ఆక్రమణల వలన పూడికతీయడం వీలు కాలేదని, ఫలితంగా ప్రస్తుత వర్షాలకు నీరు డ్రైన్లలోకి వెళ్లడానికి వీలు లేక ఇళ్లల్లోకి వచ్చి స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయా ఆక్రమణలను పట్టణ ప్రణాళిక అధికారులు నూరు శాతం తొలగించాలని, ఆక్రమణల తొలగింపు అనంతరం పూడికతీత చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. తొలగించిన ప్రాంతాల్లో ఆక్రమణలు పునరావృతం కాకుండా పట్టణ ప్రణాళిక కార్యదర్శులు, అధికారులు మెరుగైన పర్యవేక్షణ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యటనలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఏసిపి వెంకటేశ్వరరావు, డిఈఈ వెంకటరమణ, కార్పొరేటర్ నిమ్మల వెంకట రమణ, ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇది డంపింగ్ యార్డ్ అనుకుంటున్నారా

# అయితే పొరపాటే

**చల్లపల్లి మండలం రామానగరం 12వ వార్డు లోని ఒక రోడ్డు**

**ఇటీవల కాలంలోనే కొన్ని లక్షల**



**స్టాఫ్ రిపోర్టర్ మచిలీపట్నం (పెన్ పవర్) జులై 22:**

గవర్నమెంట్ సొమ్ము పోతే నాకేంటి గ్రామ ప్రజలు చిన్న పిల్లలు సైతం ఇబ్బందులు పడి రోగాలు పాలు అయితే నాకేంటి ఈ మురుగునీరు గాజు సీసాలు బాటిల్స్ వాళ్ల కాళ్ళకి గుచ్చుకుని గాయాలు అయితే నాకేంటి. అంటూ రెచ్చిపోయి అహంకారం చూపించి మహిళలను చూడకుండా ఇష్టం వచ్చినట్టు నోరు పారేసుకు ని ఇష్టరాజ్యంగా ప్రహరీ గోడలు బద్దలు కొట్టుకుంటూ ఇరుకు సందులో పెద్ద మిషన్లు పెట్టి అతను పని చేసుకుంటూ వెళ్ళాడు. ఆరో నెంబరు కాలువ మైలుజవాను వికృతి చేష్టలు ఇప్పటికైనా పై అధికారులు అతని నోరు పై తాళం వేస్తారో లేదో చూడాలి. ఈ పని జరిగే మూడు రోజులు అవుతున్న పట్టించుకోని శానిటరీ ఇన్స్పెక్టర్ పంచాయతీ వారు 12వ వార్డులో గ్రామ ప్రజలు చేసుకున్న పాపము అనుకుంటూ... గవర్నమెంట్ వారికి ఇంటి పన్నులు వగైరా బిల్లులు చెల్లించకుండా అక్రమంగా నివసిస్తున్నారని బాధపడుతున్నట్లు ఉన్నారు. పంచాయతీ వారు చిన్నపిల్లల సైతం స్కూలుకి వెళ్లాలంటే రోడ్డు మీదకు రావాలంటే భయపడుతున్నారు. మురుగు కంపుతో ఇంకా ఎన్ని రోజులు పడుతుందో అది క్లియర్ చేయడానికి ఎదురు చూడాల్సిన అవసరం ఉంది.

మరిన్ని వివరాలు పెన్ పవర్ సంచికలో...



# మహిళల రక్షణ కవచం “శక్తి యాప్”

**గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులు అవగాహన కలిగివుండాలి**

**చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు**





**వేటపాలెం,పెన్ పవర్,జులై 22**

గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులు అవగాహన కలిగివుండాలని చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డిఎస్పీ మోయిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం మంగళవారం వేటపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శక్తి యాప్, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మహిళా సంబంధిత నేరాలు, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. ఈ అవగాహన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగ పాల్గొని శ్రద్ధగా విన్నారు. ఈ సందర్భంగా చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం ఎస్ఐ హరిబాబు మాట్లాడుతూ “శక్తి యాప్” మహిళలకు రక్షణ కవచంలాంటిదని, జిల్లాలోని ప్రతి ఒక్క మహిళ వారి మొబైల్ లలో నిక్షిప్తం చేసుకోవాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏదైన అనుకోని ఆపద వచ్చినప్పుడు పోలీస్ ల తక్షణ రక్షణ పొందడానికి “శక్తి యాప్” యంతగానో ఉపయోగపడుతుంద న్నారు. పోలీస్ సేవలను మహిళలకు మరింత చేరువ చేసేందుకు శక్తి వాట్సాప్ నెంబర్ 79934 85111 ను కూడా అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఆపదలో ఉన్న మహిళలు శక్తి వాట్సప్ నెంబరుకు వీడియో కాల్ (లేదా) వాయిస్ కాల్ (లేదా) మేసేజ్ చేసినా సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్ కు సంకేతాలు వెళతాయన్నారు. వెంటనే శక్తి బృందాలు స్పందించి ఆపదలో ఉన్న మహిళ వద్దకు చేరుకొని సహాయం అందించడం జరుగుతుందన్నారు. 24/7 అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థుల అవగాహన కోసం గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి డెమో నిర్వహించామని, ఏ స్పర్శ మంచిది, ఏది చెడు అనే విషయాలను స్పష్టంగా వివరించామని పేర్కొన్నారు. మహిళా సంబంధిత నేరాలు, బాల్యవివాహాల వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాల గురించి వివరించామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు 100/112, 1098, 181, 1930, 1972 ల గురించి కూడా అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో చీరాల సబ్ డివిజన్ శక్తి బృందం సభ్యులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ వద్దు బ్రో

**నరసరావుపేటలో పోలీస్ విభాగం అవగాహన కార్యక్రమం**

**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జులై 22**

పల్నాడు జిల్లా నరసరావుపేట రెడ్డి కాలేజీలో పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు, మంగళవారం ఉదయం డ్రగ్స్ వద్దు బ్రో అనే డ్రగ్స్ నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం నరసరావుపేట డీఎస్పీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో, రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ హైమారావు ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా హైమారావు సిఐ మాట్లాడుతూ: విద్యార్థులు తమ భవిష్యత్తుపై దృష్టి పెట్టాలి. డ్రగ్స్, మందు, వైట్నర్ వంటి ఆరోగ్యానికి హానికరమైన వస్తువులను దూరంగా ఉంచుకోవాలి అని చెప్పారు. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలి, చెడు సహవాసాలు, చెడు ప్రేరణల నుండి తప్పుకోవాలి అని అన్నారు. అంతేకాకుండా సెల్‌ఫోన్‌లను ఉపయోగకరమైన మార్గాల్లో వినియోగించాలి అని చూసించారు. మంచి లక్ష్యాలను ఏర్పరచుకుని కష్టపడి ఉద్యోగాలు సంపాదించాలి. అని సూచనలు చేస్తూ విద్యార్థుల్లో డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ హరిబాబు, ఎస్ఐ లేఖ ప్రియాంక, పోలీస్ స్టేషన్ సిబ్బంది, కాలేజీ ప్రిన్సిపాల్ శివ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకుని పోలీసులు యువతలో సానుకూల మార్పు తీసుకొచ్చేందుకు చురుకుగా పనిచేస్తున్నారని హాజరైన వారంతా అభినందించారు.

